ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
7
శ్రీపొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
బుధవారం 1 జనవరి 2025





నెల్లూరు : కిక్కిరిసిన సండే మార్కెట్



ఎన్ని రకాల కేకులో..!



బుచ్చిరెడ్డిపాళెం : జొన్నవాడ ఆలయంలో ప్రత్యేక క్యూలైన్లు, చలువ పందిళ్లు

ఆంగ్ల సంవత్సరాదికి
ఘన స్వాగతం

కొత్త ఆశలు.. సరికొత్త ఆకాంక్షలతో...

- అర్ధరాత్రి జిల్లావ్యాప్తంగా మిన్నంటిన సంబరాలు
- ఆలయాలు, చర్చిలలో ప్రత్యేక ఏర్పాట్లు

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో తీపి, గురుతులు మిగిల్చిన 2024 కాలగర్భంలో కలిసిపోయింది. సరికొత్త ఆశలు, ఆకాంక్షలతో 2025వ సంవత్సరం ఆరంభమైంది. మంగళవారం అర్ధరాత్రి పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతు, కొత్త సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ జిల్లావాసులు ఘనంగా వేడుకలు చేసుకున్నారు. ఇళ్లు, అపార్టుమెంట్లు, ఫంక్షన్‌హాళ్ల తదితర ప్రాంతాల్లో బాణసంచా పేల్చి, కేకుల్ కట్‌చేసి ఆనందం పంచుకున్నారు. ఆంగ్ల సంవత్సరాది శుభాకాంక్షలు తెలిపేందుకు స్వీట్లు, పండ్లు, కేకులు, పూలమాలలు, బుక్ షాపులు, గిఫ్ట్ దుకాణాలు, బంగారుషాపులు కొనుగోలుదారులతో కిక్కిరిసిపోయాయి. మిడ్‌నైట్ డిన్నర్లు, పార్టీల కోసం దాదాపు అన్ని హోటళ్లలో గదులు రిజర్వు అయిపోయాయి. కూటమి ప్రభుత్వం 31వ తేదీనే పింఛన్లు, ఉద్యోగులకు జీతాలు ఇవ్వడంతో న్యూయర్ సంబరాల అంగరంగా జరుపుకునేందుకు ప్రతి కుటుంబం సిద్ధమైంది. దీంతో నిత్యావసర సరుకులు దుకాణాలు, ఇతర వ్యాపార సంస్థలు కళకళలాడుతున్నాయి. కొత్త సంవత్సరం.. కొత్త వాహనం అనే మాటపై వాహన, మొబైల్ దుకాణాల్లోనూ అమ్మకాలు జోరందుకున్నాయి. కాగా, పలువురు ప్రజాప్రతినిధులు జనవరి 1న తాము అందుబాటులో ఉండమని ప్రకటనలు చేశారు. చిరుద్యోగి నుంచి అధికారి వరకు, కార్యకర్త నుంచి నాయకుడి వరకు తమ బాస్‌లను ప్రసన్నం చేసుకునేందుకు పూల బొకేలు, మిఠాయిలు, పండ్లు వంటివాటి కోసం భారీగా ఆర్డర్లు ఇచ్చారు. మరోవైపు ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసింది.

- ధనుర్మాసం సందర్భంగా తెల్లవారుజాము 4గంటల నుంచే దైవ దర్శనాలు, పూజలు జరుగుతాయి. ఆంగ్ల సంవత్సరం ఆరంభం సందర్భంగా ఆలయాల్లో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఈ మేరకు ఆలయ నిర్వాహకులు అవసరమైన క్యూలైన్లు, మంచినీరు, వైద్య శిబిరాలు వంటి ఏర్పాట్లు చేశారు. ప్రముఖ ఆలయాల్లో ఉత్సవర్లకు పూలంగి సేవలు జరగనున్నాయి. అలాగే, సాయి మందిరాల్లో తెల్లవారు జాము నుంచి భక్తులు దర్శనం కల్పిస్తున్నారు. ఆలయాలు, బాబా మందిరాలు విద్యుద్దీప అలంకరణలతో శోభిల్లుతున్నాయి.

- మంగళవారం సాయంత్రం నుంచే చర్చిలలో క్రైస్తవులు భక్తి, సంగీత కార్యక్రమా లు, బైబిల్ ప్రార్థనలు చేశారు. ఆ తర్వాత అర్ధరాత్రి 12గంటలకు 'హ్యాపీ న్యూయర్' అంటూ శుభాకాంక్షలు తెలుపుకుని కేక్‌లు కట్ చేసి పంచుకున్నారు.

- రాపూరు : పెంచలకోనలో భక్తుల కోసం విస్తృత ఏర్పాట్లు చేశారు. నెల్లూరు, కడప జిల్లాల నుంచి శ్రీవారి దర్శనార్థం భక్తులు భారీగా తరలివస్తారని, ఈ మేరకు అంతరాలయ దర్శ నం రద్దు చేసినట్లు ఈవో శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ప్రత్యేక క్యూలైన్లు, మంచినీరు, అన్నదానం తదితర ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

- బుచ్చిరెడ్డిపాళెం : జొన్నవాడ క్షేత్రంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. రాత్రి 9 గంటలకు పెద్ద వెండి నందిపై ఆదిదంపతులు ఊరేగనున్నారు. ముందుగా గంగా, కామాక్షి సమేత మల్లికార్జున స్వామికి కల్యాణం జరగనుంది. ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి శ్రీచక్ర నవావరణ పూజలతోపాటు అంతరాలయం, గర్భాలయంలో ప్రత్యేక పుష్పాలంకరణ చేయనున్నట్లు ఈవో ఏవీ.శ్రీనివాసులురెడ్డి తెలిపారు.



శుభాకాంక్షలు తెలిపేందుకు పూలబొకేలు రెడీ!

జిల్లా ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా బాలాంజనేయులు

నెల్లూరు(హరనాథపురం), (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా బాలాంజనేయులు నియమితులయ్యారు. ఇప్పటి వరకు జిల్లా రిజిస్ట్రార్‌గా పనిచేసిన హరివర్మ మంగళవారం ఉద్యోగ విరమణ పొంద డంతో ఆయన స్థానంలో ఒంగోలు రిజిస్ట్రార్ బాలాంజనేయులును ఇన్ చార్జిగా ప్రభుత్వం నియమించింది. బాలాంజనేయులు గతంలో నెల్లూరు జిల్లా రిజిస్ట్రార్‌గా పనిచేస్తూ ఒంగోలుకు బదిలీ అయిన విషయం విదితమే.

పోలీసు పరీక్షలకు 275 మంది హాజరు

నెల్లూరు(క్రైం), డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని పోలీసు కవాతు మైదానంలో జరుగుతున్న కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు మంగళవారం రెండో రోజు కొనసాగాయి. 600 మంది అభ్యర్థులకుగాను 275 మంది మాత్రమే హాజరయ్యారు. 325 మంది గైర్హాజరయ్యారు. అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలించి, ఎత్తు, ఛాతీ కొలతలు తీసిన అనంతరం 1600, 100 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్ పరీక్షలు నిర్వహించారు. ఎస్పీ కృష్ణకాంత్ పర్యవేక్షించారు.

నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు(ఆంధ్రజ్యోతి) : సీడాప్ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఉచితంగా నైపుణ్య శిక్షణ ఇప్పిస్తున్నామని జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి మానిపాటి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మూ డు నెలల ఈ శిక్షణకు ఆసక్తి గల వారు ఈ నెల 6వ తేదీ లోపు విద్యార్హతల సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ కార్యాలయం ఫోన్ 7780 676306 నెంబరును సంప్రదించాలని కోరారు.

వేణుగోపాలుడికి స్వర్ణ వైరముడి సేవ



నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని మూలాపేట వేణుగోపాల స్వామి ఆలయంలో అధ్యయనోత్సవాలు మంగళవారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ధనుర్మాసోత్సవాల్లో గోదాదేవికి విశేష పూజలు, తిరుప్పావై సేవాకాలం జరిగాయి. సాయంత్రం వేణుగోపాల స్వామికి స్వర్ణ వైరముడి సేవ అలంకారంలో ప్రాకారోత్సవం జరిగింది. గోదాదేవికి సహస్ర దీపాలంకరణ సేవ, ఊంజల్ సేవ జరిగాయి. ఆలయ చైర్మన్ మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, సహాయ కమిషనర్, ఈవో జే శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

ఎస్సీ కులగణన జాబితాపై అభ్యంతరాలు తెలపండి : డీడీ

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి) : సచివాలయ సిబ్బంది ద్వారా ప్రభుత్వం గతేడాది నిర్వహించిన ఎస్సీ కులగణన జాబితాను సచివాలయ నోటీసు బోర్డులలో ఉంచామని సోషల్ వెల్ఫేర్ డీడీ కే శోభారాణి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ జాబితాపై అభ్యంతరాలు ఉంటే జనవరి 7వ తేదీలోగా తెలియ చేయాలని కోరారు. వాస్తవానికి అభ్యంతాల స్వీకరణ గడువు మంగళవారంతో ముగిసిందని, దానిని ప్రభుత్వం జనవరి 7వ తేదీ వరకు పొడిగించిందని తెలిపారు.

3న జాబ్‌మేళా

ఉదయగిరి (ఆంధ్రజ్యోతి): స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 3న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్.నారాయణస్వామి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 10వ తరగతి, డిగ్రీ, ఐటీఐ చదివిన యువకులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అర్ధరాత్రి నుంచే ఆంగ్ల సంవత్సరాది వేడుకలు

ఆత్మకూరు, డిసెంబరు 31: నియోజకవర్గ ప్రజలు మంగళవారం అర్ధరాత్రి దాటాక 2025కి ఘనస్వాగతం పలికారు. రాత్రి 12 గంటలు దాటగానే పట్టణంలో ఒక్కసారిగా బాణసంచా పేలింది. హ్యాపీ...న్యూ ఇయర్...అంటూ యువత పెద్ద ఎత్తున హంగామా చేశారు. ఈ సందర్భంగా ఆలయాలు, చర్చిలు, మసీదులను విద్యుత్‌దీపాలతో అలంకరించారు. సర్వమతాలవారు జరుపుకునే పండుగ కావడంతో పలుచోట్ల ప్రత్యేకంగా కేక్‌లు, బొకేల విక్రయ దుకాణాలు వెలిశాయి. పట్టణంలో ప్రధాన రాజకీయ నేతలు ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. పట్టణంలోని శ్రీవేంకటేశ్వరస్వామి, అలఘునాథస్వామి, శివాలయం, సాయిబాబామందిరం, కాశీనాయన ఆశ్రమం, కన్యకాపరమేశ్వరి, అభయాంజనేయస్వామి ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తుల తాకిడికి అనుగుణంగా దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పట్టణంలో వస్త్ర, ఫ్యాన్సీ దుకాణాలు మంగళవారం ప్రజలతో కళకళలాడాయి.

● సంగం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని యువత ఆంగ్ల సంవత్సరాది వేడుకలకు సర్వం సిద్ధం చేశారు. సంగం బస్టాండ్ సెంటర్‌లో స్వీట్ స్టాల్ నిర్వాహకులు అరకేజీ నుంచి రెండు, మూడు కేజీల కేక్‌లను అమ్మకానికి సిద్ధం చేశారు. మంగళవారం అర్ధరాత్రి దాటగానే కేక్ కట్ చేసి సంబరాలు చేసుకునేందుకు సిద్ధమయ్యారు. విద్యార్థులు సైతం గ్రీటింగ్ కార్డుల విక్రయ దుకాణాలకు వెళ్లడంతో అక్కడ సందడి ఏర్పడింది.



ఆత్మకూరులో అమ్మకానికి సిద్ధంగా పలు రకాల కేకులు

ఉపకరణాల ద్వారా బోధన

ఉదయగిరి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఉపకరణాల ద్వారా విద్యాబోధన చేయాలని ఎంఈవో షేక్ మస్తాన్‌వలి తెలిపారు. మంగళవారం మండలంలోని కుర్రపల్లి ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. భోజన పథకం నిర్వాహకులు విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఆత్మకూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ సచివాలయ ఉద్యోగుల సంఘం(వీడబ్ల్యూఎస్‌జీ ఈఏ)క్యాలెండర్‌ను మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జీ బుజ్జిరెడ్డి, ఎంపీడీవో పీ ఐజాక్‌ప్రవీణ్, ఏం శ్రీనివాసులు, అసోషియేషన్ నాయకులు రవూఫ్, వినయ్, పంచాయతీ కార్యదర్శులు, సచవాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ రుసుం వసూళ్ల వేలం రద్దు

ఉదయగిరి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన బస్టాండ్‌లో వాహనాల రుసుం వసూళ్ల వేలంను రద్దు చేసినట్లు పంచాయతీ ఈవో షేక్ కరీముల్లా తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వేలం అసంపూర్తిగా ముగియడంతో సర్పంచి సైతం వేలంను రద్దు చేసినట్లు ప్రకటించారన్నారు. ఈ విషయాన్ని డీఎల్‌పీవో దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సూచన మేరకు మంగళవారం కార్యాలయంలో సర్పంచి పావులూరి సామ్రాజ్యం అధ్యక్షతన అత్యవసర సమావేశం నిర్వహించామన్నారు. ఈ సమావేశంలో 10 మంది వార్డుసభ్యులు పాల్గొనగా, వారిలో 8 మంది వేలంను రద్దు చేయాలని సూచించారన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచి ముర్తుజాహుస్సేన్, వార్డుసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

క్యాటిల్ షెడ్లు త్వరగా పూర్తి చేయండి

కలువాయి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన క్యాటిల్ షెడ్ల (పశుల కొట్టాలు) నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని డ్వామా పీడీ గంగాభవాని లబ్ధిదారులకు సూచించారు. మంగళవారం మండలంలోని బాలాజీరావుపేటలో షెడ్ల నిర్మాణాలను ఆమె పరిశీలించారు. సంక్రాంతి నాటికి ప్రారంభోత్సవాలు జరగాలని సిబ్బందిని ఆదేశించారు.

రిటైర్డ్ హెచ్‌ఎంకి సన్మానం

సీతారామపురం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పడమటి రొంపిదొడ్లలో ఉన్న ఎంపీపీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేసి పదవీ విరమణ పొందిన షేక్ జిలానిబాషాని మంగళవారం ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈవో షేక్ మస్తాన్‌వలి పాల్గొని శాలువా, పూలదండతో సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పేరాల శ్రీనివాసులు, ఎడమ తిరుపతయ్య, బాలకృష్ణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ పేరుతో విధులకు డుమ్మా

కలువాయి, (ఆంధ్రజ్యోతి): పింఛన్ల పంపిణీ పేరుతో కొంతమంది సచివాలయ సిబ్బంది విధులకు డుమ్మా కొడుతున్నారు. దీంతో వివిధ పనులపై సచివాలయానికి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జనవరిలో ఫించన్లను ఒక రోజు ముందుగా నే(మంగళవారం) పంపిణీ చేశారు. కలువాయిలో మూడు సచివాలయాలు ఉన్నాయి. 1వ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ ఆధార్ క్యాంప్ డ్యూటీలో ఉన్నాడు. 2వ సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ సెలవులో ఉన్నారు. ఇక మిగిలిన మూడవ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ పింఛన్ల పంపిణీ పేరుతో విధులకు హాజరు కాకపోవడంతో మంగళవారం పలు సర్టిఫికెట్లు కోసం దరఖాస్తు చేసుకునే వారు ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ రమేష్ దృష్టికి తీసుకుపోగా పింఛన్ల పంపిణీ రోజు కూడా సచివాలయ సిబ్బంది విధులకు తప్పకుండా హాజరుకావాలని అన్నారు.

క్విజ్‌లో సత్తాచాటిన సాయితేజ

వింజమూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కౌశల్ సైన్స్ క్విజ్ -2024 పోటీల్లో మండలంలోని గుండెమడగల ఉన్నత పాఠశాల విద్యార్థి అంకినపల్లి సాయితేజ రాష్ట్రస్థాయిలో ద్వితీయస్థానం సాధించాడు. విజయవాడలో స్కూల్ ఆఫ్ ప్లానింగ్‌అండ్‌ఆర్కిటెక్చర్, ఏపీ సైన్స్ సిటీ, భారతీయ విజ్ఞాన మండలి సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో 52 పాఠశాలలు పాల్గొన్నాయి. అందులో సాయితేజ ద్వితీయ స్థానం సాధించి రూ.12వేల నగదు బహుమతి, జ్ఞాపిక, ప్రశంసా పత్రం పొందాడు. ఈ సందర్భంగా హెచ్‌ఎం జీ ప్రభాకర్‌రెడ్డి, గైడ్ టీచర్ ఎం. మాల్యాద్రి, ఉపాధ్యాయులు సాయితేజను మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రత్యేకంగా అభినందించారు.

కావలిలో సీపీఐ శత వార్షికోత్సవాలు

కావలి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): సీపీఐ శతక వారోత్సవాల్లో భాగంగా స్థానిక సీపీఐ కార్యాలయంలో మంగళవారం సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య పార్టీ జెండాను సీపీఐ సీనియర్ నాయకుడు బలిజేపల్లి వెంకటేశ్వర్లుతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ట్రంకురోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం నుంచి పొట్టి శ్రీరాములు విగ్రహం వరకు సీపీఐ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాజగోపాల్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు దర్గాబాబు, నాగరాజు, బోస్, నరసింహా రావు, నారాయణ క్రిషోర్, లోకసత్తా మాలకొండారెడ్డి పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

కావలి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): పట్టణ టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి 12 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యసేవలు పొందలేని వారికి సీఎం రిలీఫ్ ఫండ్‌ను అందిస్తున్నట్లు చెప్పా రు. సమావేశంలో నేతలు గుత్తికొండ క్రిషోర్, పాపనబోయిన సురేష్, శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

ఏకసభ్య ఎస్సీ కమిషన్‌ను రద్దు చేయాలి

ఉలవపాడు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ కోసం వేసిన ఏక సభ్య కమిషన్ సర్వే తప్పులతడకగా ఉందని వెంటనే ఆ కమిషన్‌ను రద్దు చేయాలని చాకిచర్ల శ్రీనగర్ ఎస్సీ మాల కులస్థులు డిమాండ్ చేశారు. అనంతనం సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజకు వినతిపత్రం అందజేశారు. వారి వెంట తాటితోటి రవికుమార్, సుదర్శి చెన్నకేశవులు, సుబ్బరాయుడు ఉన్నారు.

ఐదుగురికి టీడీపీ జీవితకాల సభ్యత్వాలు

కావలి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మాజీ మున్సిపల్ చైర్మన్ ప్ర భాకర్‌నాయుడుతో పాటు మరో పోతుగంటి అలేఖ్య, మద్దుల మాధవరాకేష్, గాదంశెట్టి మారుతీబాబు, ముప్పరాజు నాగార్జున కిరణ్‌లు మంగళవారం ఒక్కొక్కరు రూ.లక్ష చెల్లించి టీడీపీ జీవితకాల సభ్యత్వాలను తీసుకున్నారు. పట్టణ టీడీపీ కార్యాల యంలో జరిగిన ఎమ్మెల్యేదగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి చేతుల మీదుగా వారు సభ్యత్వ పత్రాలు అందుకున్నారు.

శాశ్వత డీలర్ల నియామకానికి నోటిఫికేషన్

కందుకూరు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): కందుకూరు డివిజన్‌లో ఖాళీగా ఉన్న 149 రేషన్ దుకాణాలకు శాశ్వత ప్రాతిపదికన డీలర్ల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజ తెలిపారు. అర్హులైన అభ్యర్థులు జనవరి 10వ తేదీ సాయంత్రం 5గంటలలోగా దరఖాస్తులను సబ్ కలెక్టరు కార్యాలయంలో అందజేయాలన్నారు.

అమిత్‌షాను మంత్రివర్గం నుంచి తొలగించాలి

కావలి టౌన్, డిసెంబరు31: పార్లమెంట్‌లో బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను మంత్రివర్గం నుంచి తొలగించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు తాళ్లూరు మాల్యాద్రి డిమాండ్ చేశారు. ఆయన సంఘం సభ్యులతో కలిసి ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు.

వైభవంగా బండ్లమాంబ గ్రామోత్సవం

కావలి టౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ట్రంకురోడ్డులో మంగళవారం రాత్రి బండ్లమాంబ అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. సత్యనారాణస్వామి ఆలయం వద్ద నుంచి ప్రారంభమైన ఉత్సవంలో మాలధారులు పాల్గొన్నారు.



చల్లి నైవేద్యాన్ని తీసుకెళ్తున్న మహిళలు

అల్లూరులో వేడుకగా తిరునాళ్ల

కొలువుదీరిన గంగమ్మ, కలుగోళమ్మ, పోలేరమ్మ అమ్మవార్లు

1,001బోనాలతో పోతురాజుకు చల్లి నైవేద్యం సమర్పణ

అల్లూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : గొడ్డందు... బిడ్డందు... పాడి, పంటలందు.. అంతా సల్లంగా చూడలంటూ అల్లూరువాసులు తమ గ్రామ దేవతలు గంగమ్మ, కలుగోళమ్మకు, పోలేరమ్మలను వేడుకున్నారు. మంగళ వారం మూడో చాటింపుతో తిరునాళ్లను ప్రారంభించారు. ఈ వేడుకలో మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు. 1001 మంది మహిళలు పసుపు రంగు మట్టి కుండల్లో చల్లి నైవేద్యంతో బీసీ కాలనీలోని పోలేరమ్మ చెట్టు నుండి ఊరేగింపుగా విష్ణువర్ధన్ రెడ్డి నివాసానికి చేరుకు న్నారు. అక్కడ నుంచి విష్ణు స తీమణి శివప్రియతో కలసి పోతురాజుకు నైవేద్యాన్ని సమర్పించా రు. ఈ సందర్భంగా అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సం చేప ట్టారు. తిరునాళ్ల సందర్భంగా ఆలయాల ప్రాంగణాల్లో ఏర్పాటు చేసిన భారీ విద్యుత్ దీపాలంకరణ ఆకట్టుకుంది. అలాగే గ్రామంలోని పెద్ద కాపు, పెద్ద గొల్ల, పెద్ద మాదిగల ఆధ్వర్యంలో అమ్మవార్లకు విశేష పూజలు చేసి పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వీరతాళ్లు, గంగపెట్టె సంప్రదాయ కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉత్స వాలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. కాగా, అమ్మవా ర్లను కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి, సోమశిల ప్రాజెక్టు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ తదతర ప్రముఖులు దర్శనం చేసుకున్నారు.



పొంగళ్లు పొంగిస్తున్న కుమ్మరి కులస్థులు, మహిళలు

పోటాపోటీగా అర్జీల సమర్పణ



ఉదయగిరి మండలం బిజ్జంపల్లి సచివాలయంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పలు సమస్యలపై అర్జీలు అందజేసేందుకు ప్రజలు ఎగబడ్డారు బండగానిపల్లిలో గందరగోళంగా ఉన్న భూముల వివరాలను సరిచేయాలని రైతు సంఘం నాయకుడు కాకు వెంకటయ్యతోపాటు పలువురు రైతులు కోరారు. ఈ విషయాన్ని వారు తహసీల్దారు సుభద్ర దృష్టికి తీసుకెళ్లారు. అక్రమణకు గురైన ముస్లిం శ్మశానవాటికను కాపాడి పట్టా మంజూరు చేయాలని స్థానికులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ సురేంద్ర, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

- ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి)

ప్రతి జిల్లాకు పరిశ్రమలు

- పింఛన్ల పంపిణీలో మంత్రి నారాయణ



పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి నారాయణ

నెల్లూరు (హరనాథ పురం), డిసెం బరు 31 (ఆంధ్ర జ్యోతి) : రాష్ట్రం లోని అన్నీ జిల్లాల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా ప్రతి జిల్లాకు పరి శ్రమలను తీసుకు వస్తామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరులోని గుర్రాలమడుగు సంఘంలో మంగళ వారం ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను లబ్ధిదారులకు మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమలతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, ఆయా ప్రాంతాల యువతీ యువ కులకు ఉద్యోగాలు లభించి వారి ఆర్థిక పరిస్థితి మెరుగుపడటమేకాకుండా రాష్ట్రం ఆర్థికంగా కుదుటపడుతుందని చెప్పారు. కూటమి ప్రభుత్వం 64 లక్షల మందికి పెన్షన్లు అందచేయడానికి సంవత్సరానికి రూ.32వేల కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. నెల్లూరు నగరంలో 46,383 మందికి పెన్షన్లు అందచేస్తున్నామన్నారు. నగరంలో పెండింగ్‌లో ఉన్న భూగర్భ డ్రైనేజీ, మంచినీటి వసతి సౌకర్యాలను తొందర్లోనే పూర్తి చేస్తామని తెలిపారు. సర్వేపల్లి కాలువ, జాఫర్ సాహెబ్ కాలువ గట్లపై ఉన్న పేదల ఇళ్లను ఎటువంటి పరిస్థితులలో తొలగించమని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ, నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కౌశల్ క్విజ్‌లో జిల్లాకు ద్వితీయ స్థానం

నెల్లూరు(విద్య), డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఏపీ సైన్స్ సిటీ, భారతీయ విజ్ఞాన మండలి సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి కౌశల్ క్విజ్ పోటీల్లో జిల్లాకు చెందిన ముగ్గురు విద్యార్థుల బృందం ద్వితీయ స్థానం సాధించింది. అమ్మవారిపాళెం జడ్పీ హైస్కూల్‌కు చెందిన ఎన్ పెంచల కిషోర్, గుండె మడకల జడ్పీ హైస్కూల్‌కు చెందిన ఏ సాయితేజ, జలదంకి జడ్పీ హైస్కూల్‌కు చెందిన ఎం హశ్వంత్ సాయి ఈ ఘనత సాధించి రూ.12 వేలు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు. అలాగే, 10వతరగతి రీల్స్ విభాగంలో గట్టుపల్లి జడ్పీ పాఠశాలకు చెందిన ఎం సింధు రూ.3వేలు నగదు పురస్కారాన్ని అందుకుంది. ఈ సందర్భంగా డీఈవో బాలాజీరావు, కౌశల్ రాష్ట్ర కోఆర్డినేటర్ పూడి ప్రసాద్, జిల్లా కోఆర్డినేటర్ ఆర్‌ఆర్‌ఎస్ ప్రసాద్, యూ రఘుకుమార్‌లు విజేతలను అభినందించారు.

మైన్స్‌కు అనుమతులు ఇవ్వండి!

- మైనింగ్ డీడీకి యజమానుల విజ్ఞప్తి

నెల్లూరు (వెంకటేశ్వరపురం) డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉన్న మైనింగ్ గనుల్లో తవ్వకాలకు వెంటనే అనుమతులు ఇవ్వాలని ముఖ్యంగా క్వార్ట్జ్ గనుల లీజులను రెన్యూవల్ చేయాలని మైనింగ్ యజమానులు డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం నెల్లూరు తప్పగిరికాలనీలో ఉన్న మైనింగ్ కార్యాలయానికి యజమానులు భారీగా చేరుకొన్నారు. మైనింగ్ డీడీ బాలాజీనాయక్ లేకపోవడంతో గంటల తరబడి పడిగాపులు కాశారు. ఆ తర్వాత వచ్చిన డీడీకి యజమానులు వినతిపత్రం అందించారు. వైసీపీ ప్రభుత్వంలో మైన్స్‌ను తమకు కాకుండా బలవంతంగా లాగేసుకొని రూ.వేల కోట్ల అవినీతికి పాల్పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి 8 నెలలు గడుస్తున్నా ఇంతవరకు అనుమతులు ఇవ్వలేదని వాపోయారు. క్వారీల్లో పనుల్లేక వేలాది మంది కూలీలు అల్లాడుతున్నారని పేర్కొన్నారు. కొన్నిటికి లీజు రెన్యూవల్ చేసి, ఇంకొన్నిటికి ఎందుకు ఆపారని డీడీని నిలదీశారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. త్వరలోనే అన్ని మైనింగ్ గనులను పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తామని డీడీ హామీ ఇచ్చారు.

బాలుడిని తల్లి చెంతకు చేర్చిన పోలీసులు

కావలి రూరల్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఇంటి నుండి అలిగి వెళ్లిన బాలుడి ఆచూకీని గంటల వ్యవధిలో రూరల్ పోలీసులు కనిపెట్టి మంగళవారం తల్లి వద్దకు చేర్చారు. పట్టణం లోని బాలక్రిష్ణారెడ్డి నగర్ కర్లగుంట మాధవి పెద్ద కుమారుడు వెంకట అవినాష్ బడికి వెళ్లి ఇంటికి తిరిగిరాలేదు. చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికి ఆచూకీ దొరక్క పోవడంతో బాలుడి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్‌ఐ తిరుమల రెడ్డి సిబ్బంది తో కలసి గాలింపు చర్యలు చేపట్టి బాలక్రిష్ణారెడ్డి నగర్ శివారులోని జామాయిల్ తోటలో ఉన్న బాలుడి గుర్తించి తీసుకవచ్చారు. బాలుడి ఆచూకీ గుర్తించి తల్లి చెంతకు చేర్చటంతో ఎస్‌ఐ తిరుమల రెడ్డి, సిబ్బందిని అభినందించారు.

3న రామాయపట్నం పోర్టుకు ప్రముఖుల రాక

కందుకూరు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): రామాయపట్నం పోర్టును ఈ నెల 3న రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి, ఏపీ మారిటైమ్‌బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్యతో కలిసి సందర్శించనున్నారు. పోర్టు పురోగతి, అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకు భూసేకరణ తదితర అంశాలపై వారు అధికారులతో సమీక్షించనున్నారని అధికారులు తెలిపారు.

సంగం - చిన్నక్రాక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనుల పరిశీలన

దగదర్తి (బిట్రగుంట) డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): దగదర్తి మండల పరిధిలోని సంగం - చిన్నక్రాక బ్యాలెన్సింగ్ రిజర్వేయర్ పనులను మంగళవారం సోమశిల ప్రాజెక్ట్ నెల్లూరు ఎస్ఈ బీవీ రమణారెడ్డి పరిశీలించారు. (సీబీఆర్) కావలి కాలువ పూడికతీత పనుల విషయమై ఈఈ సుబ్రహ్మణ్యం, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరితో చర్చించారు. కార్యక్రమంలో డీఈ మహేష్, జేఈలు వినయ్‌కుమార్, రమణయ్య, స్థానిక నేత పులి శీనయ్య ఉన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	112
లేయర్ లైవ్	95
స్కిన్ చికెన్	206
స్కిన్‌లెస్	226
లేయర్	162

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7344
వెండి కిలో ధర	రూ. 89,600
వెండి ఒక గ్రాము	రూ.92.60

నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం

వెంకటాచలం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడమే వీఎస్‌యూ లక్ష్యమని వీసీ ప్రొఫెసర్ సారంగం విజయ భాస్కర్ రావు స్పష్టం చేశారు. కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో సీడీసీ డీన్ డాక్టర్ ఎం.హుస్సేనయ్య ఆధ్వర్యంలో అనుబంధ కళాశాలల ప్రిన్సిపాళ్లతో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ముఖ్యఅతిథిగా వీసీ పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల శ్రేయస్సు కోసం అను బంధ కళాశాలలు విద్యా ప్రమా ణాలు పాటించాలని, పరిశోధ నాత్మక శైలిలో విద్యాబోధన చేయాలని సూచించారు. ప్రతి కళాశాల నిబద్ధతతో, విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడే కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కళాశాలల పనితీరును పరిశీలించడానికి, మెరుగుపరచడానికి యూని వర్సిటీ తరచూ పర్యవేక్షిస్తుందన్నారు. అనుబంధ కళాశాల లను యూనివర్సిటీ మార్గదర్శ కాలకు అను గుణంగా నిర్వహించాలని సూచించారు. ప్రధానంగా అకడ మిక్ విద్యాబోధనలో నూతన విధానాలను అందిపుచ్చుకొని విద్యార్థులకు ఉత్తమ శిక్షణ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, పరీక్షల నిర్వా హణాధికారి డాక్టర్ ఆర్ మధుమతి, కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, టీ వీరారెడ్డి, అనుబంధ కళాశాలల ప్రిన్సిపాళ్లు తదితరులు పాల్గొన్నారు.

3న జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ : డీఈవో

నెల్లూరు(విద్య), డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఆర్ఎస్ఆర్ఎం పాఠశాలలో 3వతేదీన జరిగే జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఈఓ ఆర్.బాలాజీరావు తెలిపారు. నగరంలోని డీఈవో కార్యాలయంలో మంగళవారం జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహణ కమిటీతో ఆయన సమావేశమై మాట్లాడారు. రిజిస్ట్రేషన్, ఆహ్వానం, ఆహారం, మంచినీరు, పారిశుధ్యం, ఆరోగ్యం, క్రమశిక్షణ, డాక్యుమెంటేషన్ కమిటీసభ్యులంతా తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. 150 మంది విద్యార్థులు తమ ఎగ్జిబిట్‌లను ప్రదర్శించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా సైన్స్ అధికారి కరుణాకర్‌రెడ్డి, డీసీఈబీ కార్యదర్శి రామ్‌కుమార్, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

బొకేలు, కేకులు తీసుకురావొద్దు : కలెక్టరేట్

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 31 (ఆంధ్ర జ్యోతి) : అంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా జనవరి 1న కలెక్టర్ కార్యాలయానికి అధికారులు, ఇతరులు ఎటువంటి బొకేలు, కేకులతో రావద్దని కలెక్టరేట్ అధికారిక వర్గాలు ఓ ప్రకటనలో కోరాయి. భారతదేశ మాజీ ప్రధాన మంత్రి డాక్టర్ మన్మోహన్‌సింగ్ మరణానికి సంతాపంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డిసెంబరు 26 నుంచి జనవరి 1వరకు ఏడు రోజులు సంతాపదినాలు ప్రకటించిందని పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలో వివిధ శాఖల అధికారులు ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలను కచ్చితంగా, ఎలాంటి ఆటంకం లేకుండా పాటించాలని సూచించాయి.

హైకోర్టు ఆదేశాలతో ఇసుక రీచ్ ఏర్పాటుకు అనుమతి



ఇసుక రీచ్ ఏర్పాటుకు హద్దులు, బాటలు చూపిస్తున్న మైనింగ్, ఇరిగేషన్ అధికారులు

సంగం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఆదేశాలతో సంగం పెన్నానదిలో డ్రెడ్జింగ్ విధానంలో ఇసుక తీసేందుకు అధికారులు మరో సొసైటీకి అనుమతించారు. మూడు నెలల కిందట పెన్నాలో డ్రెడ్జింగ్ విధానంలో పడవలతో ఇసుక తీసేందుకు కూటమి ప్రభుత్వం టెండర్లు పిలిచింది. నిబంధనల మేరకు రెండు మత్స్య సహకార సంఘాలకు అనుమతించారు. అయితే అధికారపార్టీ అండ దండలు ఉన్న ఒక సంఘం మరో సంఘాన్ని పెన్నానదిలో ఇసుక రీచ్ ఏర్పాటును అడ్డుకున్నారు. అధికారులను ఆశ్రయించినా వారి నుంచి ఎటువంటి సహకారం అందలేదు. దీంతో ఆ సంఘం హైకోర్టును ఆశ్రయించింది. ఈ నేపథ్యంలో కోర్టును ఆశ్రయించిన సంఘానికి రీచ్ ఏర్పాటుకు సహకరించాలని ఆదేశించి తీర్పు ఇచ్చింది. ఆ తీర్పు మేరకు మంగళవారం హైకోర్టు లాయర్ సమక్షంలో ఇరిగేషన్ ఈఈ నాగరాజు, తహసీల్దారు సోమ్లా నాయక్‌లు కోర్టుకు వెళ్లిన మత్స్య సహకార సంఘానికి పెన్నానదిలో ఇసుక రీచ్ ఏర్పాటుకు అన్ని ఏర్పాటు చేశారు. రీచ్‌తో పాటు, బాట ఏర్పాటుకు హద్దులు చూపించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ వినయ్‌కుమార్, ఏఎస్ఐ జాకీర్‌భాష తదితరులు పాల్గొన్నారు.

ఆవులకు బొబ్బర్ల వ్యాధి

అనంతసాగరం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగ్రామాల్లో ఆవు లకు బొబ్బర్ల వ్యాధి సోకడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆవుల శరీరంపై చిన్నపాటి మచ్చలు ఏర్పడి ఆతర్వాత పెద్దవిగా మారి పుండ్లుగా మారుతున్నాయి. ఒక పశువు నుంచి మరో పశువుకు ఈవ్యాధి సోకుతుందని రైతులు వాపోతున్నారు. వ్యాక్సిన్ తోపాటు, వ్యాధి నివారణ చర్యలు లేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. అనంత సాగరం పశు వైద్యశాలకు ఇన్‌చార్జి డాక్టర్ కావడంతో ఆయన అందుబాటులో ఉండటం లేదని పలువురు ఆరోపి స్తున్నారు. సిబ్బం ది సేవలు కూడా నామమా త్రంగా ఉన్నాయని వారు తెలిపారు. బొబ్బర్ల వ్యాధి నివారణకు జిల్లా పశుసం వర్ధకశాఖ అధికారు లు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



జేడీతో మాట్లాడుతున్న రైతులు, టీడీపీ నాయకులు

యూరియా కొరతలేదు : జేడీ సత్యవాణి

సంగం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియాతో పాటు అన్నీ రకాల కాంప్లెక్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయశాఖ జేడీ సత్యవాణి పేర్కొన్నారు. మంగళవారం ఆమె స్థానిక వ్యవసాయ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. జేడీ కార్యాలయానికి వచ్చారని తెలిసి స్థానిక రైతులతోపాటు టీడీపీ నాయకులు అక్కడికి చేరుకున్నారు. ఫర్టిలైజర్స్ వ్యాపారులు ఎరువులను ఎంఆర్పీ కంటే అధికంగా అమ్ముతున్నారని ఫిర్యాదు చేశారు. కాంప్లెక్స్ ఎరువులు కొంటేనే యూరియా ఇస్తామంటున్నారు. స్పందించిన ఆమె ఎంఆర్పీ కంటే అధికంగా విక్రయిస్తున్న ఫర్టిలైజర్స్‌ను వెంటనే సీజ్ చేయాలని ఆదేశించారు. అనంతరం మాట్లాడుతూ యూరియాను ఎవరైనా బ్లాక్ మార్కెట్ తరలించి ప్రకృతి కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎంఆర్పీ కంటే అధికంగా వసూలు చేస్తే 833 1057285 నంబరుకు ఫిర్యాదు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏడీలు శేషగిరి, నర్సోజి, ఏవో శ్రీహరి, వీఏఏలు పాల్గొన్నారు.

200క్యూసెక్కుల నీరు విడుదల

- రాళ్లపాడు కుడికాలువ గేటు మరమ్మతు పనులు విజయవంతం
- ప్రాజెక్టు డీఈ వెంకటేశ్వర్లు



ప్రాజెక్టు కుడి కాలువలో ప్రవహిస్తున్న నీరు

లింగసముద్రం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టు కుడి కాలువ తూములో దెబ్బతిన్న స్టాప్ లాక్ గేటు మరమ్మతుల అనంతరం ప్రాజెక్టు అధికారులు విజయవంతంగా బిగించి మంగళవారం కుడి కాలువకు 200క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా డీఈ ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కృషితోనే సమస్య పరిష్కారం అయినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గేటు పనులను చినపవని టీడీపీ నాయకుడు సోంపల్లి మనోహర్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో మరో డీఈ మధు సూదనరావు, ఏఈలు చంద్రమౌళి, నవీన్, షమీంబాషా, పారా బుచ్చయ్య చౌదరి, గొల్లపల్లి వెంకటేశ్వర్లు, గొరైపాటి శ్రీను, తాళ్లూరి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆఫర్లే ఆఫర్లు!

బుచ్చిరెడ్డిపాళెం : ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా ప్రజలను ఆకట్టుకునేందుకు వ్యాపారులు ఆఫర్లు గుప్పిస్తున్నారు. బేకరీలు, స్వీట్ స్టాల్స్, బట్టల దుకాణాలు, దాబాల నిర్వాహకులు ఏది కొన్నా ఉచిత మనీ, అతి తక్కువ డిస్కౌంట్ అంటూ ఆఫర్లు ఇస్తున్నారు. జనవర్ 1న కేక్‌లు, స్వీట్లు, కారాసు ఇలా కేజీ, 2కేజీలు పైబడి కొనుగోలు చేసేవారికి మరో పావు కిలో నుంచి కిలోవరకు ఉచితంగా ఇస్తున్నారు. బట్టల దుకాణాలలో ఒకటికొంటే మరొకటి ఉచితమనీ, హోటళ్లు, దాబాలలో ఫుడ్ నుంచి డ్రింక్స్ వరకు ఉచితంగా, డిస్కౌంట్ ప్రకటించారు. ఇక మద్యం దుకాణాల్లో గతంలోలా ఆఫర్లు ఏవీ ప్రకటించలేదు.

తాటిపర్తిలో పర్యటించిన ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో

పొదలకూరు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మండలలోని మహమ్మదాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తాటిపర్తిలో ప్రజలు జ్వరాలతో బాధపడుతున్నారని తెలిసి ఇన్‌చార్జ్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఖాదరవల్లి మంగళవారం పర్యటించారు. గ్రామంలో జ్వరపీడితులను పరిశీలించి, జ్వరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ నరసింహారావుకి సూచించారు. బుధవారం నుంచి గ్రామంలో ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహించాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి రవి కుమార్, మలేరియా సబ్ యూనిట్ అధి కారి ఆంజనేయవర్మ పాల్గొన్నారు.


తాటిపర్తిలో విచారిస్తున్న ఖాదర్‌వలి

ముగిసిన రెవెన్యూ సదస్సులు

మనుబోలు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మండలంలో ముద్దమూడి రెవెన్యూ గ్రామంలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సుతో రెవెన్యూ సదస్సులు ముగిశాయని తహసీల్దారు సీహెచ్. సుబ్బయ్య తెలిపారు. తహసీల్దారు రైతుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ మండలంలో 18 రెవెన్యూ గ్రా మాల్లో ఈనెల 6నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించామన్నారు. భూ సమస్యలపై 202 అర్జీలు వచ్చాయన్నారు. ఇందులో 53 అర్జీలను సదస్సుల్లోనే పరిష్కరించామన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీనువాసులు, ఆర్ఐ నారాయణ, వీఆర్‌వో

ప్రతి గిరిజన బిడ్డకు విద్యను అందించాలి

● సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి

వెంకటాచలం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ప్రతి గిరిజన బిడ్డకు విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కోరారు. మండలంలోని గొలగమూడి సమీపంలో ఉన్న టూరిజం కళాశాలలో జరుగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి మంగళవారం ఆయన హాజరయ్యారు. శిక్షణలో ప్రతిభ చూపిన ఉపాధ్యాయులకు ప్రశంస పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ తాను మల్లికార్జున్‌పురం, పైనాపురం గ్రామాలను దత్తత తీసుకున్నానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి సుధీర్‌బాబు, ఎంఈవో మధుసూదన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, జిల్లా ఉపాధ్యక్షుడు కుంకాల నాగేంద్రప్రసాద్, టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజా యాదవ్, విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ దేశంలోనే ఒక చరిత్ర

కూటమి ప్రభుత్వం చేపట్టిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ దేశంలోనే ఒక చరిత్రగా నిలిచిందని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. వెంకటాచలంలోని ఇందిరమ్మకాలనీ, కనుపూరు, ఇస్లాంపేట గ్రామాల్లో మంగళవారం లబ్ధిదారులకు ఆయన పింఛన్లను పంపిణీ చేశారు. అనంతరం కనుపూరు చెరువులో సోమిరెడ్డి చేప పిల్లలను వదిలిపెట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాధాకృష్ణమనాయుడు, కోదండయ్యనాయుడు, నాగార్జునరెడ్డి, రమేష్‌నాయుడు, ధనుంజయ నాయుడు, మస్తాన్‌నాయుడు, శ్రీనివాసులునాయుడు, సురేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయుల శిక్షణను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

ప్రజల కోసం పనిచేస్తేనే పదవులకు సార్థకత

● కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

ఇందుకూరుపేట, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ప్రజల కోసం పని చేస్తేనే పదవులకు సార్థకత అని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. మండలంలోని పున్నూరులో పార్లమెంటరీ ఆర్గనైజింగ్ సెక్రటరీ పొన్నెబోయిన చెంచుకిషోర్‌యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన సామాజిక పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ఇంటింటికి తిరిగి లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేశారు. గ్రామాలకు రోడ్లు, సురక్షిత తాగునీరు తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో అమలవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో నాసిరకం బియ్యం వినియోగిస్తున్నారని వస్తున్న ఫిర్యాదులపై విద్యాశాఖాధికారులను వివరణ కోరారు. సాగునీటి రంగానికి సంబంధించి రైతులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చూడాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. అనంతరం పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో కొత్తూరు, పాములవారిపాలెంలో ఏర్పాటు చేసిన గోకులం షెడ్డును ఆమె ప్రారంభించారు. తదనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొని ఆమె ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో యువ నాయకుడు దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, రావెళ్ల వీరేంద్రచౌదరి, కైలాసం ఆదిశేషారెడ్డి, మునగాల రంగారావు, కూకటి వెంకటేశ్వరరెడ్డి, దాసరి విజయకుమార్, బీజేపీ నాయకులు కైలాసం శ్రీనివాసులురెడ్డి, అన్ని శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న ప్రశాంతిరెడ్డి

ఆంగ్ల సంవత్సరాది వేడుకలకు సర్వం సిద్ధం

కోవూరు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): కోవూరులో బుధవారం ఆంగ్ల సంవత్సరాది వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు మంగళవారం అన్ని ఏర్పాట్లు చేశారు. పురాతన వీరాంజనేయస్వామి ఆలయాన్ని విద్యుద్దీపాలు, పుష్పాలతో ముస్తాబు చేశారు. అలాగే పురాతన శివాలయం, గ్రామ దేవత నాగవరప్పమ్మ ఆలయంలో పూలంగిసేవ, పల్లకీసేవలకు ఏర్పాట్లు చేశారు. అలాగే శత వసంతాలు పూర్తి చేసుకున్న శారాబిలాక్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలకు చర్చి నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు. పలు కూడళ్లల్లో యువకులు భారీ కటౌట్లు కట్టి ఆంగ్ల సంవత్సరానికి ఆహ్వానం పలికారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నిలువెత్తు ఫొటోలతో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియచేస్తూ భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు

బుచ్చిరెడ్డిపాళెం,(ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెంలోని సాయిబాబా మందిరం, సీతా లక్షణ సమేత కోదండరామస్వామి, కళ్యాణ వేంకటేశ్వరస్వామి, వేణుగోపాల స్వామి, కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో ఆంగ్ల సంవత్సరం సందర్భంగా ప్రత్యేక పుష్పాలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆయా ఆలయాల నిర్వాహకులు తెలిపారు. రేబాలలోని పుట్టాలమ్మ, దామరమడుగులోని శివాలయం, పెనుబల్లిలోని రామాలయం తదితర ఆలయాలలో పత్యేక పూజలు జరుగనున్నాయి.

బుల్లి క్యాలెండర్ ఆవిష్కరణ



అగ్గిపెట్టెలో ఇమిడే బుల్లి క్యాలెండర్‌ను మండలంలోని యాచవరానికి చెందిన సూక్ష్మ కళాకారుడు ఆలూరు రాము ఆచారి తయారు చేశారు. దీనిని మంగళవారం మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో జలజాక్షి ఆవిష్కరించారు. సాధారణ క్యాలెండర్ వలె 12 నెలలకు 12 పేజీలు, పండుగలు, తిథులు రాసి ఉన్నాయి. దీనిని చూసి ఆశ్చర్యపోయిన ఎంపీడీవో తయారీదారు ఆచారిని అభినందించారు.

– మనుబోలు,(ఆంధ్రజ్యోతి)

కామాక్షితాయి ఆలయ క్యాలెండర్ ఆవిష్కరణ

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మడలంలోని జొన్నవాడ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయ ఆంగ్ల సంవత్సరం-2025 క్యాలెండర్‌ను కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు మంగళవారం నెల్లూరులోని వారి నివాసంలో ఆవిష్కరించారు. ముందుగా ఆలయ పండితులు వారిని వేదమంత్రాలతో ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ఏవీ.శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్ఈ డైరీ ఆవిష్కరణ

అసోసియేషన్ ఆఫ్ సెక్రటరేట్ ఇంజినీర్స్ డైరీని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీహరి, నగర పంచాయతీ కమిషనర్ ఎల్.చంద్రశేఖర్ రెడ్డి, పీఆర్ ఏఈ మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఎంఎస్ఆర్ఈజీఎస్ సిబ్బంది, మండల కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీవోపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

రాపూరు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబుపై భౌతికదాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఎంపీడీవో భవానీ డిమాండ్ చేశారు. రాపూరు మండల పరిషత్ కార్యాలయం ఎదుట మంగళవారం మండల పరిషత్ సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ నిందితులను శిక్షించి భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ దశరథరామిరెడ్డి, సీనియర్ సహాయకులు చంద్రశేఖర్, ఈవోపీఆర్‌డీ బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

గతుకుల బతుకుల నుంచి విముక్తి

● బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీనివాస్

నెల్లూరు(క్రైం), డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రోడ్లపై గతుకుల బతుకుల నుంచి ప్రజలను గట్టెక్కించే గట్టి నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు వెళుతోందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సామంచి శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారంలోకొచ్చిన ఆరు నెలల వ్యవధిలో 11వేల కిలోమీటర్ల పరిధిలో రోడ్లను గుంతల రహితంగా మార్చేందుకు రూ.860కోట్లతో పనులు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్, కార్యదర్శి దువ్వూరు పరశురాం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి : ఎస్ఎఫ్ఐ

నెల్లూరు(విద్య), డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించి, ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఎస్ఎఫ్ఐ నేతలు డిమాండ్ చేశారు. నగరంలోని చంద్రారెడ్డి డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ స మావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు వీ నరేంద్ర మాట్లా డుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు చేపట్టేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని చెప్పారు. విద్యా, వసతి దీవెన పథకాల బకాయిలు విడుదల చేయకపోవడంతో డిగ్రీ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నార న్నారు. శివ, పవన్, బాలాజీ, శ్యామ్, కృష్ణ, వెంకటేష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై అధికారుల దాడులు

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని దామరమడుగు రీచ్ నుంచి అక్రమ ఇసుక రవాణాపై మంగళవారం రెవెన్యూ, మైనింగ్ అధికారులు దాడులు నిర్వహించి ఓ డోజర్, ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రీచ్‌వద్ద రెవెన్యూ సిబ్బందిని కాపలా పెట్టారు. ఈ దాడుల్లో మైనింగ్ డీడీ బాలాజీ నాయక్ పాల్గొన్నారు.


మాజీ కార్పొరేటర్ పొన్నెబోయిన ఓం ప్రకాష్ యాదవ్ తండ్రి సుందర రామయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న మంత్రి పొంగూరు నారాయణ

అపస్, హంస క్యాలెండర్ల ఆవిష్కరణ


అపస్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి ఆనం


హంస క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి నారాయణ

నెల్లూరు(విద్య/వైద్యం), డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(అపస్) నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మంగళవారం ఆయన నివాసంలో ఆవిష్కరించారు. అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం కృషి చేయడమేకాక, ఉపాధ్యాయ, ఉద్యోగులతో స్నేహపూరితంగా వ్యవహరిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో అపస్ జిల్లా అధ్యక్షుడు రాజగోపాలాచార్యులు, కార్యదర్శి అనిల్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శులు రాము, చంద్రమౌళి, వెంగయ్య, జిల్లా ఆర్థిక కార్యదర్శి మణికందకాచారి తదితరులు పాల్గొన్నారు.

కాగా, ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ (హంస) నూతన సంవత్సర క్యాలెండర్‌ను రాష్ట్ర మున్సిపల్ మంత్రి పొంగూరు నారా యణ మంగళవారం ఆయన నివాసంలో ఆవిష్కరించారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరిస్తుందని తెలియచేశారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలులో ఉద్యోగులు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో హంస జిల్లా అధ్యక్షుడు చేజెర్ల సుధాకర్‌రావు, గౌరవాధ్యక్షుడు డాక్టర్ వెంకటేశ్వర్లు, గౌరవ మహిళా అధ్యక్షురాలు ఇందిర, సలహాదారు పరిమళ తదితరులు పాల్గొన్నారు.

'లండన్' ఎగ్జిబిషన్ ప్రారంభం

నెల్లూరు(సాంస్కృతికం), డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): నగరంలోని వైఎంసీఏ మైదానంలో లండన్ నగరం సెట్టింగ్‌తో చిల్డ్రన్స్ ఫన్ ఫెయిర్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. దీనిని మాజీ మేయర్ నంది మండలం భానుశ్రీ మంగళవారం రాత్రి ప్రారంభించారు. లండన్ నగర నమూనాలను ప్రజలు తప్పకుండా సందర్శించాలని పిలుపునిచ్చారు. నగరంలో ప్రప్రథమంగా లండన్ సెట్టింగ్ ఏర్పాటు చేసిన ఎం రాజారెడ్డి, ఎస్‌కే బాబును అభినందించారు. ప్రతిరోజు సాయంత్రం 4 నుంచి రాత్రి 10గంటల వరకు ఎగ్జిబిషన్ తెరచి ఉంటుందని, స్విమ్మింగ్ పూల్, జెయింట్ వీల్, మెర్రీ కొలంబస్, డ్రాగన్ ట్రైన్ వంటి రైడర్స్ ఉన్నాయని చెప్పారు. దేశం నలుమూలల తయారైన వస్త్రాలు, గృహోపకరణాలు, నోరూరించే ఫుడ్‌కోర్టులు ఉన్నాయని, ప్రజలు సందర్శించాలని కోరారు.


లండన్ బ్రిడ్జి సెట్టింగ్

గుర్తుతెలియని మహిళ మృతి

నెల్లూరు(క్రైం), డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులో సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని మహిళ రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడింది. కొండాయపాళెం గేటు సమీపంలోని మూడో ట్రాక్‌పై ఈ ఘటన చోటుచేసుకుంది. మృతదేహంపై నారింజ రంగు కలిసిన టాప్, మెరూన్ కలర్ ప్యాంటు ఉన్నాయి. సమాచారం అందుకున్న రైల్వే ఎస్ఐ జీ మాలకొండయ్య మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మేయర్ పేషీ సూపరింటెండెంట్‌గా సిద్దిక్

నెల్లూరు(సిటీ), డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలో పలు విభాగాల అధికారులను బదిలీ చేస్తూ కమిషనర్ సూర్యతేజ మంగళవారం ఉత్తర్వులిచ్చారు. హౌస్ ఫర్ ఆల్ విభాగంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఎంఎస్ఏ సిద్దిక్‌ను మేయర్ పేషీ సూపరింటెండెంట్‌గా బదిలీ చేశారు. ఎస్టాబ్లిష్‌మెంట్‌లో సీనియర్ సహాయకుడిగా ఉన్న బాలసుబ్రహ్మణ్యంను హౌసింగ్ విభాగంలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా నియమించారు. అలాగే, లీగల్ సెల్ విభాగంలో సూపరింటెండెంట్‌గా ఉన్న ఏ ప్రవీణ్‌కు ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగం అదనపు ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ

నెల్లూరు (లీగల్), డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : అనంతపురం పోలీస్ స్టేషన్‌లో సీనియర్ న్యాయవాది బీవీ శేషాద్రి మృతికి, లక్కిరెడ్డిపల్లి సీఐ, పోలీసులు న్యాయవాది సుదర్శన్ రెడ్డిపై చేసిన దాడికి నిరసనగా నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్వర్యంలో న్యాయవాదులు మంగళవారం కోర్టు విధులను బహిష్కరించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు వేనాటి చంద్రశేఖర్ రెడ్డి, నెల్లూరు బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ ఎస్‌వీఎల్ వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

2025కు రచయితల స్వాగతం

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఎన్టీఆర్ పార్కులో మంగళవారం రాత్రి కొత్త సంవత్సరానికి నెల్లూరు రచయితలు స్వాగతం పలికారు. రచయితలకు 2024 సంవత్సరంలో మంచి గుర్తింపు వచ్చిందని, అన్నీ రాష్ట్రాల్లో జరిగిన కార్యక్రమాల్లో నెల్లూరు రచయితలు పాల్గొన్నారంటూ నెల్లూరు రచయితల సంఘం అధ్యక్షురాలు గోవిందరాజుల సుభద్రాదేవి హర్షం వ్యక్తం చేశారు. కొత్త సంవత్సరం అందరికీ ఉత్సాహాన్ని ఇవ్వాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భారతి, సుహాసిని, నాగేశ్వరమ్మ, కృష్ణవేణి, అవ్వారు శ్రీధర్‌బాబు, రాజా, వేణు, రవి, తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా రంగంలో ఏపీని అగ్రగామిగా నిలిపుదాం

నెల్లూరు(వ్యవసాయం), డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఆక్వా రైతులు, పారిశ్రామికవేత్తలతోపాటు ఆక్వా రంగానికి అన్ని విధాల సాయం అందించ డం ద్వారా దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ కోవైస్ చైర్మన్ ఆనం వెంకట రమణారెడ్డి, మత్స్యశాఖ కమిషనర్ టీ డోలాశంకర్ పేర్కొన్నారు. నెల్లూరులోని ఓ హోటల్‌లో మంగళవారం ఆక్వా రంగానికి చేయూత, అభివృద్ధి, ఆధునీకరణకు నాబార్డు ద్వారా రుణ సదుపాయం అందించే పలు అంశాలపై అవగాహన సదస్సు జరిగింది. వారిద్దరు మాట్లా డుతూ నాబార్డు ద్వారా కిసాన్ క్రెడిట్ కార్డులు, జాయింట్ లయబిలిటీ గ్రూపులకు వడ్డీ రాయితీ, వినూత్న సాగు పద్ధతులకు ప్రోత్సాహకాలు అందిస్తామని తెలిపారు. రూరల్ ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్, ఇంటిగ్రేటెడ్ ఫిష్ ఫార్మింగ్, అలంకరణ చేపల పెంపకం, ఆక్వా సాగులో శిక్షణ వంటివి నా బార్డు ద్వారా నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు, ప్రకాశం జిల్లా జేడీ ఆవుల చంద్రశేఖర్ రెడ్డి, రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ రీజనల్ మేనేజర్ రాజశేఖర్, సీజీఎం భవానీ శంకర్, నాబార్డు సీజీఎం గోపాల్, డీజీఎం రామలింగం, మత్స్య సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

కొత్త సంవత్సరం సరికొత్త వెలుగులు నింపాలి

- వేమిరెడ్డి దంపతుల శుభాకాంక్షలు

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : నూతన సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితంలో సరికొత్త వెలుగులు నింపాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆకాంక్షించా రు. వారు ఓ ప్రకటనలో జిల్లా ప్రజలకు 2025 నూతన సంవత్సర శుభాకాం క్షలు తెలిపారు. గతేడాది చేదు జ్ఞాపకాలు తొలగిపోయి కొత్త సంవత్సరం కొత్త ఆనందాన్ని, కొత్త విజయాలను అందించాలని అభిలషించారు.







2,55,828 మందికి పింఛన్ల పంపిణీ

రాష్ట్రంలో జిల్లాకు రెండో స్థానం

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీలో రాష్ట్రంలో జిల్లాకు రెండవ స్థానం దక్కింది. నూతన సంవత్సరం పురస్కరించుకుని ఒకరోజు ముందుగానే పింఛన్ల పంపిణీ కార్యక్రమం ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో ఉదయం 6గంటల నుంచే ఇంటింటికి పింఛన్లను సచివాలయ సిబ్బంది పంపిణీ చేశారు. 2,63,995మందిగాను 2,55,828మందికి రూ.108కోట్లు పింఛన్లు పంపిణీ చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు తెలిపారు. మిగిలినవారికి గురువారం ఇవ్వనున్నారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ నగరి నియోజకవర్గంలోని వడమాలపేట మండలం అప్పలాయగుంటలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌తో కలిసి ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతాపింఛన్లు పంపిణీ చేశారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
7
తిరుపతి
జిల్లా వార్తలు
బుధవారం 1 జనవరి 2025

కొత్త ఏడాదిలో..

జిల్లా ప్రగతి రథాలు పారిశ్రామికం, పర్యాటకం

'ఆంధ్రజ్యోతి'తో కలెక్టర్ వెంకటేశ్వర్



గతం ఒక జ్ఞాపకం. భవిష్యత్తు ఒక ఆశ. గతం ఎన్ని గాయాలు చేసినా భవిష్యత్తు దిశగా నడిపించేది ఆ ఆశే! కలలకు రెక్కలు తొడిగి నేడు 2025లోకి అడుగుపెడుతున్నాం. ఈ సందర్భంగా జిల్లా రథసారథి కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్‌తో ఆంధ్రజ్యోతి సంభాషణ ఇది. జిల్లా అభివృద్ధికి 2025లో పెట్టుకున్న లక్ష్యాలు.. ప్రాధాన్యాలు.. వాటి సాకారానికి చేస్తున్న ప్రయత్నాలను.. జిల్లా ప్రజలకు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయన ఇలా వివరించారు.

- తిరుపతి(కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి

పరిశ్రమలకు రాయితీలు

పారిశ్రామిక, పర్యాటక రంగాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలనుకుంటున్నాం. పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రాయితీలు కల్పిస్తాం. ఏర్పేడు వద్ద ఎలక్ట్రానిక్ క్లస్టర్ ఏర్పాటుకు 7 వేల ఎకరాలు కేటాయించాం. కృష్ణపట్నం పోర్టు వద్ద క్రిష్ సిటీ (కృష్ణపట్నం ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ) ప్రాజెక్టులో భాగంగా రూ.1,500 కోట్లతో పారిశ్రామిక కారిడార్ సిద్ధం అవుతోంది. పలు జాతీయ, అంతర్జాతీయ పరిశ్రమలు అక్కడికి వస్తున్నాయి. దీనివల్ల తిరుపతి జిల్లాకు చాలా మేలు జరుగుతుంది. ప్రస్తుతం శ్రీసిటీ 8వేల ఎకరాల్లో ఉంది. మరో 2వేల ఎకరాలు భూసేకరణ సిద్ధం చేసి పెట్టాం. కొన్ని అంతర్జాతీయ పరిశ్రమలు ఆక్కడ ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూపుతున్నాయి.

అభివృద్ధికి రాదారులు

వివిధ రాష్ట్రాలను కలుపుతూ జాతీయ రహదారుల నిర్మాణ పనులు కూడా వేగవంతమయ్యాయి. తిరుపతి-చెన్నై, తిరుపతి-మదనపల్లెతో పాటు సాగరమాల రోడ్ల నిర్మాణ పనులు సాగుతున్నాయి. ఇవన్నీ జిల్లా అభివృద్ధిని వేగవంతం చేస్తాయి.

ఆధ్యాత్మిక పర్యాటకం

జిల్లాగా ఏర్పడిన తరువాత తిరుపతికి తీర ప్రాంతం కలిసొచ్చింది. తిరుమల క్షేత్రం ఇక్కడే ఉంది. శ్రీకాళహస్తి, తిరుచానూరు సహా అనేక పుణ్యక్షేత్రాలు ఉన్నాయి. ఆధ్యాత్మిక పర్యాటకాన్ని ప్రోత్సహించాలి. ఇందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందిస్తున్నాం.

యువతకు ఉపాధి

తిరుమలకు దేశ, విదేశాల నుంచి నిత్యం వేలాది మంది తరలివస్తున్నారు. వారు రెండు రోజుల పాటు జిల్లాలోనే ఉండేలా చూడగలగాలి. ఆహ్లాదంగా గడపడానికి ఎన్నో ప్రదేశాలున్నాయి. జలపాతాలు, బీచ్‌లు, పులికాట్ సరస్సు, నేలపట్టు పక్షుల కేంద్రం, షార్ సందర్శించే విధంగా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాం. పర్యాటక రంగం అభివృద్ధి వల్ల ఉపాధి అవకాశాలు బాగా పెరుగుతాయి.

మెట్రోలకు దీటుగా తిరుపతి

ఏడాదిలో.. మెట్రో నగరాలతో పోటీపడేలా తిరుపతిని అభివృద్ధి చేయాలన్న సీఎం చంద్రబాబు సంకల్పాన్ని సాకారం చేస్తాం. అందుకు ప్రణాళికలు రూపొందించాం.

వ్యవసాయంలో సాంకేతికత

వ్యవసాయం మీద ఆధారపడిన తిరుపతిజిల్లాలో వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక వ్యవస్థను తీసుకొస్తున్నాం. అందులో డ్రోన్ వ్యవస్థ ప్రధానమైంది. ఉద్యాన వన పంట ల్లో మామిడే కాకుండా ఇతర పంటలపై కూడా రైతులకు ఆసక్తికలిగేలా పలు రాయితీలు ఇవ్వాలని నిర్ణయించాం. తీరప్రాంతంలో ఆక్వాచేపల ఉత్పత్తికి అధిక ప్రాధాన్యమిస్తున్నాం.

SOUTH INDIAN Bank
సౌత్ ఇండియన్ బ్యాంక్ లిమిటెడ్
రీజనల్ ఆఫీస్ : హైదరాబాద్

నమోదిత కార్యాలయం: SIB హౌస్, T.B. రోడ్డు, మిషన్ క్వార్టర్స్, త్రిసూర్, కేరళ - 680001, ఫోన్: 91-487-2420020, 2442021 (ఫ్యాక్స్)
ప్రాంతీయ కార్యాలయం: నం.157/6, మొదటి అంతస్తు, CHAI కాంప్లెక్స్, పార్క్ రోడ్, గవర్నర్ ఎస్టేట్, సికింద్రాబాద్, డైమండ్ పాయింట్, సికింద్రాబాద్ - 500009, టెలిఫోన్: 040 2784 8404 (Gen) / 2784 8405 (ఫ్యాక్స్), 2784 8406 (DGM)

Ref: RO-HYD/REC/GEN/0487/2024-25 తేది: 30.12.2024

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6) మరియు 9(1) నిబంధనలతో చదువబడే సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన.

[illegible]

బకాయి: 02.11.2024 నాటికి మెసర్స్ మైథిలీ హాస్పిటల్స్ ఖాతాలో మొత్తం రూ.5,15,60,170.59 [illegible] రూ.1,23,99,798.50 [illegible] రూ.1,06,83,584.29 [illegible] 27.01.2025న [illegible]

[illegible]

బిటం నం.7 : ఎస్‌ఆర్‌ఓ గూడూరు, విక్రయ దస్తావేజు నం.1035/2017, తేది:10.05.2017లో ఖాతా నం.2033, రెవెన్యూ రికార్డ్స్ 1బి క్రింద సర్వే నం.919-1ఎ, 919-1బి1, 919-2, 928-1బి, 929-డి మరియు 929-ఇ లో ఎ.3.00 సెంట్ల విస్తీర్ణ భూమి. [illegible] సర్వే నం.913 లో భూమి కొంత విస్తీర్ణం.

రిజర్వు ధర	రూ.7,70,00,000/- (రూపాయలు ఏడు కోట్ల డెబ్బై లక్షలు మాత్రమే)
బయానా (EMD)	రూ.77,00,000/- (రూపాయలు డెబ్బైఏడు లక్షలు మాత్రమే) బయానాను 26.01.2025న లేదా అలోగా సా.04.00 గం. వరకు డిపాజిట్ చేయవలెను
బిడ్ పెరుగుదల మొత్తం	రూ.1,00,000/- (రూపాయలు ఒక లక్ష మాత్రమే)
వేలం తేది మరియు సమయం	27.01.2025 ఉ.11.00 గం. నుండి మ.12.00 గం. వరకు (అమ్మకం ముగిసే వరకు 5 నిమిషాల అపరిమిత ఆటో పొడిగింపులతో)
బ్యాంకుకు తెలిసిన బాకీలు ఋణభారాలు	లేవు

అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు సౌత్ ఇండియన్ బ్యాంక్ లిమిటెడ్ వెబ్ పోర్టల్ (సెక్యూర్డ్ క్రెడిటర్) వెబ్‌సైట్ అనగా www.southindianbank.comలో ఏర్పాటుచేసిన లింకును రిఫర్ చేయండి. వివరాలు https://bankauctions.inలో కూడా లభిస్తాయి. [illegible] 09000297130/ 09290616886లో సంప్రదించండి.

తేది: 30.12.2024 అధీకృత అధికారి
ప్రదేశం: హైదరాబాద్ (చీఫ్ మేనేజర్)



ఎమ్మెల్యే విజయశ్రీ చొరవతో ఆరునెలల చిన్నారి గుండెకు శస్త్ర చికిత్స

పెళ్లకూరు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): గుండె సంబంధిత సమస్య ఉన్న ఆరునెలల చిన్నారికి ఎమ్మెల్యే విజయశ్రీ చొరవతో శస్త్రచికిత్స జరిగింది. పెళ్లకూరు మండలం జీలపాటూరు గ్రామానికి చెందిన కన్నలి వెంకటేష్, సాయి ప్రసన్న దంపతులకు ఆరునెలల క్రితం ఆడబిడ్డ జన్మించింది. పాప పుట్టినప్పుడే గుండె సంబంధిత సమస్య ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. ఆరు నెలల తరువాత ఆపరేషన్ చేయాలని చెప్పారు. ఈనెల 23న తిరుపతిలోని పద్మావతీ చిన్నపిల్లల హృదయాలయ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చిన్నారికి ఆధార్ కార్డు లేకపోవడంతో ఆరోగ్యశ్రీ వర్తించదని చెప్పారు. చిన్నారి తండ్రి వెంకటేశ్ సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంను కలిసి చిన్నారి పరిస్థితిని వివరించారు. వెంటనే ఎమ్మెల్యే సిఫార్సు లేఖ ఇవ్వగా, నెలవల సుబ్రహ్మణ్యం ఆస్పత్రి ఆర్ఎంవోతో పాటు వైద్యులతో మాట్లాడి చిన్నారికి ఆపరేషన్ చేసి ప్రాణదానం చేయాలని సూచించారు. వైద్య పరీక్షల తరువాత సోమవారం చిన్నారికి శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తి చేశారు. ఎమ్మెల్యే విజయశ్రీ సహకారంతో తన బిడ్డకు ప్రాణాపాయం తప్పిందని చిన్నారుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే, ఆమె తండ్రి నెలవలకు కృతజ్ఞతలు తెలిపారు.

చెక్ బౌన్స్ కేసులో ఇద్దరికి జైలు

కోట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): చెక్ బౌన్స్ కేసులో ఇద్దరికి జైలు శిక్ష విధిస్తూ కోట జూనియర్ సివిల్ జడ్జి భరత్ కమల్ తీర్పు ఇచ్చారు. కోట పట్టణానికి చెందిన బాలాజీకి ఏడాది జైలు శిక్ష విధించడంతో పాటు బాధితుడికి రూ.2.5లక్షలు చెల్లించాలని తీర్పు ఇచ్చారు. అలాగే మండలంలో విశ్వనాధపుర అగ్రహారం గ్రామానికి చెందిన హేమంత్ కుమార్ ఏడాది జైలు శిక్షతో పాటు బాధితుడికి 1.30లక్షలు చెల్లించాలని తీర్పు ఇచ్చారు.

ఎన్‌బీకేఆర్‌లో ప్రాంగణ ఎంపికలు

కోట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం బెంగళూరుకు చెందిన టాట్ఎఫ్‌డీ టెక్నాలజీ సంస్థ ప్రాంగణ ఎంపికలను నిర్వహించింది. కంపెనీ సీఈవో, ఎన్‌బీకేఆర్ ఐఎస్‌టీ పూర్వ విద్యార్థి రమేష్‌తో పాటు కంపెనీ ప్రతినిధి సంధాని ఆధ్వర్యంలో 256 మంది విద్యార్థులకు ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించగా 46 మందికి కోడింగ్ పరీక్షకు అర్హత సాధించారు. కోడింగ్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారిని రూ.3.8 లక్షల నుచి రూ.4.6 లక్షలు వార్షిక వేతనంతో ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నట్లు ప్రాంగణ ఎంపికల అధికారి డాక్టర్ కిషాధార్, డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి తెలిపారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

వాకాడు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తహసీల్దారు రామయ్య అన్నారు. మండలంలోని నెలిపూడి గ్రామంలో మంగళవారం సివిల్ రైట్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాలపై అవగాహన కలిగి ఉండటంతో పాటు సమస్యలపై ప్రజలు స్పందించాలన్నారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి తెలుసుకోవాలని సూచించారు. గ్రామాల్లో అందరూ కలసికట్టుగా జీవనం సాగించాలని, గొడవలకు, అల్లర్లకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు యంబేటి పోలయ్య, మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామా విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మార్చి నెలాఖరుకు పోలేరమ్మ ఆర్చి నిర్మాణం పూర్తి

వెంకటగిరి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి పట్టణంలోని క్రాస్ రోడ్డు సెంటరులో తన సొంత నిధులతో నిర్మిస్తున్న పోలేరమ్మ ఆర్చి పనులను మంగళవారం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పరిశీలించారు. పనులు వేగంగా జరుగుతున్నాయని, మార్చి నెలాఖరు కల్లా నిర్మాణం పూర్తి చేయిస్తామని తెలిపారు. అమ్మవారి ఆర్చి నిర్మించాలన్నది తన చిన్ననాటి కల అన్ని అది నేడు నెరవేబోతుండటం సంతోషంగా ఉందన్నారు.

నెలబల్లిరెట్టపల్లిలో సీపీఐ శతాబ్ది ఉత్సవాలు

చిల్లకూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెలబల్లిరెట్టపల్లి గ్రామంలో మంగళవారం సీపీఐ శతాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. ముందుగా గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు ప్రభాకర్, శశికుమార్ మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో 1925 డిసెంబరు 26వ తేదీన ఆవిర్భవించిన సీపీఐ దేశ సమైక్యత, సమగ్రత కోసం సమరశీల పోరాటాలు చేసిందన్నారు. కార్యక్రమంలో రమేష్, చంద్రయ్య, శ్రీనివాసమూర్తి, యశ్వంత్, బాలాజీ, సీతాభాస్కర్, తులసి, రఘురామయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

రసాభాసగా కౌన్సిల్ మీట్

- టీడీపీ, వైసీపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం
- రాజీనామా చేద్దామని సవాళ్లు



సమావేశంలో టీడీపీ, వైసీపీ నాయకుల వాగ్వాదం

నాయుడుపేట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట అంబేద్కర్ భవన్‌లో మంగళవారం చైర్ పర్సన్ కటకం దీపిక అధ్యక్షతన కమిషనర్ ఫజులుల్లా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. అజెండాలో పొందు పరచిన అంశాలను కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. అజెండాలో పెడుతున్న నిధుల వినియోగం, చెల్లింపులు ఏ విధంగా జరుగుతున్నాయని వైసీపీ కౌన్సిలర్లు ప్రశ్నించగా, టీడీపీకి చెందిన మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో కేటాయించిన పనులనే చేపడు తున్నట్లు వివరించారు. వైసీపీ మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటకృష్ణారెడ్డి, కౌన్సిలర్ దారా రవి కలుగజేసుకొని గతంలో జరిగిన పనులకు బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నామని చెప్పడంతో వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పదవులకు రాజీనామా చేసి మళ్లీ పోటీకి సిద్ధమవ్వాలంటూ ఇరు పార్టీల కౌన్సిలర్లు సవాళ్లు విసురుకున్నారు. చైర్ పర్సన్ దీపిక కలుగజేసుకొని సర్దిచెప్పారు. అనంతరం వైస్ చైర్మన్ రఫీ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న స్థలాలు అన్యాక్రాంతం కాకుండా ఆ స్థలాలలో వాణిజ్య దుకాణాలు ఏర్పాటు చేయాలన్నారు. దారా రవి మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు జీతాలు వెంటనే అందివ్వాలని కోరారు.

చిన్నారిపై వృద్ధుడి లైంగిక దాడి
నిందితుడిపై పోక్సో కేసు నమోదు

చిట్టమూరు, డిసెంబర్ 31(ఆంధ్రజ్యోతి): ఓ చిన్నారిపై లైంగిక దాడి చేసిన వృద్ధుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. డీఎస్పీ రమణకుమార్ కథనం మేరకు... మండలంలోని ఓ గిరిజన కాలనీకి చెందిన మూడేళ్ల చిన్నారిపై అదే గ్రామానికి వృద్ధుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని పోక్సో కేసు నమోదు చేశామని డీఎస్పీ తెలిపారు.

దివ్యాంగురాలిపై అత్యాచారయత్నం

తడ, డిసెంబర్ 31(ఆంధ్రజ్యోతి): దివ్యాంగురాలైన మహిళపై ఓ యువకుడు అత్యాచారయత్నానికి పాల్పడిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు... తడకు చెందిన 57 ఏళ్ల దివ్యాంగురాలైన మహిళ భర్తతో విడిపోయి తన అక్కతో కలిసి ఉంటుంది. తడకండ్రిగ గ్రామానికి చెందిన ఓ యువకుడు మంగళవారం ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళపై అత్యాచారయత్నం చేశారు. అదే సమయంలో బాధితురాలి సోదరి రావడంతో నిందితుడు పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కొండపనాయుడు తెలిపారు.

శాలువాలు, బొకేలు తీసుకురావొద్దు

గూడూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): తనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసేందుకు వచ్చేవారు శాలువాలు, బొకేలు తీసుకురావొద్దని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ కోరారు. నోటు పుస్తకాలు, పెన్నులు వంటి విద్యాసామగ్రి తీసుకువస్తే వసతి గృహాల్లో చదువుతున్న పేదల విద్యార్థులకు అందజేస్తామని అన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

కోట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉత్తమ నెల్లూరులో బెల్టు దుకాణంపై ఎక్సైజ్ అధికారులు మంగళవారం దాడులు జరిపారు. 9 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని, నిబంధనలకు విరుద్ధంగా బెల్టు దుకాణం నిర్వహిస్తున్న ముంగర లక్ష్మిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు.

కోటలో సైన్స్‌ఫేర్

కోట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండలస్థాయి సైన్స్‌ఫేర్‌ను ఎంఈవో మస్తానయ్య, హెచ్ఎం సురేంద్రబాబు ప్రారంభించారు. పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు సైన్స్‌పై పలు ప్రయోగాలను ప్రదర్శించారు. ఉత్తమ ప్రయోగాలు రూపొందించిన విద్యార్థులను విజేతలుగా ఎంపిక చేశారు.

కోట బీజేపీ అధ్యక్షుడిగా వాసు

కోట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కోట మండల బీజేపీ అధ్యక్షుడిగా విశ్వనాథం వాసు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయనను బీజేపీ నేతలు పురుషోత్తమరెడ్డి, పనబాక కోటేశ్వరరావు, కోటారెడ్డి, రమేష్‌బాబు అభినందించారు.

ఉల్లాసంగా క్రికెట్ పోటీలు

గూడూరు అర్బన్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏఎరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో రోటరీక్లబ్, గూడూరు క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్ పాఠశాలల క్రికెట్ పోటీలు మంగళవారం ఉల్లాసంగా జరిగాయి. మొదటి మ్యాచ్ జీవీఎస్ - సీఎస్ఎం పాఠశాల మధ్య జరగగా సీఎస్ఎం, రెండో మ్యాచ్ విందూరు - చెన్నూరు జట్లు మధ్య జరగగా విందూరు, మూడో మ్యాచ్ ఆదిశంకర - మినర్వా జట్లు మధ్య జరగగా ఆదిశంకర జట్లు విజయం సాధించాయి. మునిగిరీష్, లవకుమార్ పర్యవేక్షించారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి: సబ్‌కలెక్టర్



సబ్‌కలెక్టర్ మీనాకు సమస్యలు వివరిస్తున్న మాజీ జడ్పీటీసీ రామచంద్రయ్య నాయుడు, పక్కన తహసీల్దార్ శ్రీనివాసులు

డక్కిలి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని దేవునివెల్లంపల్లి రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల ద్వారా భూములకు సంబంధించి సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు మాట్లాడుతూ కుప్పాయపాళెం గ్రామస్థులు సాగు చేసుకొంటున్న సీజేఎఫ్ఎస్ భూములకు 2018లో సర్వే నిర్వహించినా ఇప్పటి వరకు పట్టాలు ఇవ్వలేదని సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అంతే కాకుండా ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించారని, ఆక్రమణలను తొలగించి గిరిజనులకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన సబ్‌కలెక్టర్ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, మండల సర్వేయర్ రాజగోపాల్, ఏఎస్‌వో వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన బోధనతో పాటు విద్యార్థులకు ఉపాధి అవకాశాలు



కోడ్నెస్ట్ సంస్థ ప్రతినిధులతో విద్యార్థులు

గూడూరు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు మెరుగైన బోధనతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుమాధవ్ అన్నారు. మంగళవారం కళాశాలలో కోడ్నెస్ట్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్యాంపస్ ఎంపికలు నిర్వహించారు. 27మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సాంకేంతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుంటే ఉపాధి అవకాశాలను సులభంగా పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో కంపెనీ సీఈవో ప్రభాకర్, అర్చన, రామయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండరు ఆవిష్కరణ

నాయుడుపేట టౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): తెలుగునాడు ఉపాధ్యాయ సంఘ క్యాలెండరును సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా, టీడీపీ నాయకులు విజయభాస్కర్ రెడ్డి, రఫీ, గంగాప్రసాద్, టీఎన్‌యూఎస్ జిల్లా శాఖ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, మహిళా కార్యదర్శి మణెమ్మ, నాయుడుపేట డివిజన్ అధ్యక్షుడు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయ హుండీ లెక్కింపు

తడ, డిసెంబరు 31 (ఆంధ్ర జ్యోతి): బోడిలింగాలపాడు వద్ద ఉన్న షిరిడీ సాయిబాబా ఆలయ హుండీని మంగళవారం లెక్కించారు. 6 నెలల్లో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ.2.64 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు, నిప్పో పరిశ్రమ హెడ్ నాగరాజు తెలిపారు. కార్యక్రమంలో నిప్పో పరిశ్రమ హెచ్‌ఆర్ రమేష్, ఆలయ కమిటీ సభ్యులు ఏడుమలై, శివారెడ్డి, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమనెల్లూరులో పౌరహక్కుల దినోత్సవం

కోట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉత్తమనెల్లూరు గిరిజన కాలనీలో మంగళవారం పౌరహక్కుల దినోత్సవం జరిగింది. దళిత, గిరిజనులకు రాజ్యాంగపరంగా సంక్రమించిన హక్కుల గురించి తహసీల్దారు జయజయరావు వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ కృష్ణమ్మ, వార్డెన్ ఉషా తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు

కోట, వాకాడు, పెళ్లకూరు, డిసెంబరు 31 (ఆంధ్ర జ్యోతి): కోట మండలంలోని ఉత్తమనెల్లూరులో తహసీల్దారు జయజయరావు, వాకాడు మండలం నెలిపూడిలో తహసీల్దారు జయజయ రావు, పెళ్లకూరు మండలంలోని తాళ్వాయిపాడులో తహసీల్దార్ ద్వారక నాథరెడ్డి ఆధ్వర్యం లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు అందజేశారు.

సంవత్సరాది వేడుకలకు చెంగాళమ్మ ఆలయం ముస్తాబు



సూళ్లూరుపేట, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): చెంగాళమ్మ ఆలయాన్ని నూతన సంవత్సర వేడుకలకు ముస్తాబు చేశారు. ఆలయ ప్రాంగణం, ఆలయం లోపల వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. ఆలయం రాజగోపురం, ఆలయ ప్రాంగణమంతా విద్యుత్ దీపాల వెలుగులతో విరాజిల్లుతోంది. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. బుధ వారం అమ్మవారు స్వర్ణశోభిత స్వర్ణ అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

సంక్షేమం, అభివృద్ధి చేసి చూపిస్తాం

▸▸ **కొత్త పథకాలకు వేదికగా 2025: చంద్రబాబు**

అమరావతి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): కొత్త సంక్షేమ పథకాలు, మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు 2025 సంవత్సరం వేదిక కాబోతోందని సీఎం చంద్రబాబు అన్నారు. మంగళవారం రాత్రి ఆయన ఎక్స్ వేదికగా తెలుగు ప్రజలందరికీ ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. '2025లో మీకు ఆనందకరమైన, ఆరోగ్యకరమైన జీవితం కలగాలని కోరుకుంటున్నా. 2024లో మీరు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పుతో ఏర్పడిన మీ మంచి ప్రభుత్వం అందరి ఆశలు నెరవేర్చేలా అహర్నిశలు పని చేస్తోంది. కేవలం ఆరు నెలల్లోనే సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనలను ఆవిష్కృతం చేశాం. స్వర్ణాంధ్ర-2047 విజన్ సాకారమే లక్ష్యంగా పది సూత్రాల ప్రణాళిక అమలు చేస్తూ, అటు ప్రజా సంక్షేమాన్ని, ఇటు రాష్ట్రాభివృద్ధిని మీ అందరి సహకారంతో చేసి చూపిస్తాం. మీ అందరికీ మరోసారి హ్యాపీ న్యూ ఇయర్ 2025' అని పేర్కొన్నారు. ఇప్పటికే చేపట్టిన పలు సంక్షేమ కార్యక్రమాలను ఈ సందర్భంగా చంద్రబాబు ప్రస్తావించారు.

టీడీపీ కార్యాలయానికి బొకేలు, కేక్‌లు తేవొద్దు: అశోక్‌బాబు

నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో సీఎం చంద్రబాబును కలవటానికి వచ్చే వారెవరూ బొకేలు, పూలదండలు, కేక్‌లు, స్వీట్లు తేవొద్దని పార్టీ కార్యాలయ కార్యదర్శి పర్చూరి అశోక్‌బాబు కోరారు. వాటిని పార్టీ కేంద్ర కార్యాలయంలోకి అనుమతించరని చెప్పారు. వాటికి అయ్యే ఖర్చుతో మొక్కలు నాటడం, పేదలకు భోజన సదుపాయం కల్పించడం, విద్యార్థులకు పెన్నులు, పుస్తకాల వంటి బహుమతులివ్వడం ద్వారా సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు.

అందరూ శాంతి, శ్రేయస్సుతో ఉండాలి: గవర్నర్

అమరావతి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని రాష్ట్ర గవర్నర్ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. 'నూతన సంవత్సరంలో అందరూ ఉల్లాసం, ఉత్సాహం, శాంతి, శ్రేయస్సుతో ఉండాలి. నూతన సంవత్సరం సందర్భంగా తెలుగు ప్రజలకు శుభాకాంక్షలు. కొత్త సంవత్సరం ఉజ్వల భవిష్యత్తు కోసం ఎదురు చూడడానికి, కొత్త అవకాశాలను అన్వేషించడానికి, కొత్త లక్ష్యాలను సాధించడానికి స్ఫూర్తిని ఇస్తుంది' అని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

'బ్రేక్'పై బాబు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం: మల్లు రవి

అమరావతి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు కొనసాగేందుకు, మరింత మెరుగుపరిచేందుకు ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు తీసుకున్న నిర్ణయం ఎంతో దోహదం చేస్తుందని తెలంగాణ నాగర్‌కర్నూలు ఎంపీ డా.మల్లు రవి తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో తెలంగాణ ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల లేఖల ద్వారా వీఐపీ బ్రేక్ దర్శనాలకు అనుమతిస్తూ ఏపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏపీ సీఎం చంద్రబాబుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతూ తెలంగాణ ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల తరఫున లేఖ రాశారు.

హెల్త్ అసిస్టెంట్లను పునర్నియమించండి

▸▸ **సీఎం చంద్రబాబుకు ఉద్యోగుల సంఘం లేఖ**

అమరావతి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): హెల్త్ అసిస్టెంట్ల విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మానవతా దృక్పథంతో వ్యవహరించి సత్వరం నిర్ణయం తీసుకోవాలని ఏపీ పారామెడికల్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం కన్వీనర్ జీ.వీ.వీ.ప్రసాద్ విన్నవించారు. సంఘం తరఫున మంగళవారం ఉదయం సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు. 'హెల్త్ అసిస్టెంట్‌లు ఉద్యోగాలు కోల్పోయిన తీవ్ర ఆవేదనతో ఉన్నారు. ఇప్పటికే నలుగురు ప్రాణాలు కోల్పోయారు. రెండవ తేదీన జరిగే మంత్రివర్గ సమావేశంలో హెల్త్ అసిస్టెంట్ల పునర్నియామకంపై నిర్ణయం తీసుకోవాలి. ప్రభుత్వం తప్పనిసరిగా మాకు న్యాయం చేస్తుందనే నమ్మకంతో ఉన్నాం' అని ప్రసాద్ ఆశాభావం వ్యక్తం చేశారు.

స్థిరంగా ఉపరితల ఆవర్తనం

విశాఖపట్నం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఉపరితల ఆవర్తనం మంగళవారం నాటికి హిందూ మహా సముద్రం దానికి ఆనుకుని నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతోంది. దీని ప్రభావంతో బుధవారం దక్షిణ కోస్తా, రాయలసీమల్లో చెదురుమదురుగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. మంగళవారం రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోనూ పొడి వాతావరణం నెలకొంది. పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి.



పచ్చటి శుభాకాంక్షలు!

నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం కడియపులంక గ్రామంలో పల్ల వెంకన్న నర్సరీలో కొత్త ఏడాదికి వివిధ రకాల మొక్కలతో ఇలా వినూత్నంగా స్వాగతం పలికారు. మొక్కలు, పూలతో హ్యాపీ న్యూ ఇయర్ 2025 అంటూ కూర్పు చేశారు. ఈ నెల 18 వరకూ సందర్శకుల కోసం దీనిని ఇలాగే ఉంచుతామని నర్సరీ అధినేత పల్ల సత్తిబాబు, వెంకటేశ్, వినయ్ తెలిపారు. -కడియం

ఆన్‌లైన్‌లో బ్రేక్ దర్శనాల బుకింగ్!

ప్రజాప్రతినిధులకు ప్రత్యేక యూజర్ ఐడీ, పాస్‌వర్డ్

(తిరుమల-ఆంధ్రజ్యోతి)

ప్రజాప్రతినిధులే నేరుగా శ్రీవారి బ్రేక్ దర్శన టికెట్లు బుక్ చేసుకునేలా టీటీడీ అధికారులు ఆలోచన చేస్తున్నారు. నిత్యం దాదాపు 60వేల నుంచి 70వేల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకుంటున్నారు. అయితే దర్శనానికి వచ్చేవారిలో సగానికిపైగా బ్రేక్ దర్శనాల కోసమే ఆరాటపడుతున్నారు. నిత్యం ఎవరో ఒక ప్రజాప్రతినిధి సిఫారసు లేఖతో వచ్చి తిరుమలలోని అదనపు ఈవో కార్యాలయం అధికారులు, సిబ్బందిపై ఒత్తిడి తెస్తున్నారు. కొందరు ప్రజాప్రతినిధుల నుంచి రోజుకు 2, 3 లేఖలు కూడా వస్తున్నాయి. వీటన్నింటికీ అడ్డుకట్ట వేసేలా టీటీడీ ప్రణాళికలు రూపొందిస్తోంది. గతంలో ప్రత్యేకంగా సాఫ్ట్‌వేర్‌ను తయారుచేసి టీటీడీ బోర్డు సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులకే యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ కేటాయించారు. కోటాకు తగినట్టు వారే ఆన్‌లైన్ ద్వారా బ్రేక్ దర్శన టికెట్లు బుక్ చేసి భక్తులకు అందజేసేవారు. ఇదే పద్ధతిని ప్రజాప్రతినిధులకూ అమలుచేయడంపై అధికారులు పరిశీలిస్తున్నారు. తెలంగాణ నేతల సిఫారసు లేఖలపై కూడా వీఐపీ బ్రేక్ దర్శనాలు కేటాయించేందుకు ప్రభుత్వం తాజాగా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో నూతన విధానం అమలులోకి తెస్తే ప్రజాప్రతినిధులే తమ కోటాకు తగినట్టు ఆన్‌లైన్ ద్వారా బ్రేక్ టికెట్లు బుక్ చేసుకుంటారని భావిస్తున్నారు. ఇందులో ఉన్న సమస్యలపైనా అధికారులు దృష్టి సారించారు. ఈ విధానంలో నేతలు వంద శాతం కోటాను వినియోగించుకుంటారు.

'రేషన్' కేసులో పేర్ని నాని

ఆరో నిందితుడిగా మాజీ మంత్రి

▸▸ **నగదు బదిలీలన్నీ ఆయన ఆదేశాలతోనే!**

▸▸ **గోడౌన్ మేనేజర్ అంగీకారం**



మచిలీపట్నం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): తన గోదాముల్లో రేషన్ బియ్యం మాయం వ్యవహారంలో మాజీ మంత్రి, వైసీపీ నేత పేర్ని వెంకట్రామయ్య(నాని)పై మచిలీపట్నం తాలూకా పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఆయన్ను ఆరో నిందితుడు(ఏ-6)గా చేర్చారు. అయన గోడౌన్‌లో మేనేజరుగా పనిచేస్తున్న మానస తేజను పోలీసులు చెన్నైలో మూడ్రోజుల కిందట అరెస్టుచేసిన సంగతి తెలిసిందే. ఆయన్ను విచారించగా.. మేనేజర్ బ్యాంకు ఖాతా నుంచి రూ.24 లక్షలను మిల్లు యాజమాని బొర్రా అంజనేయులు, లారీడ్రైవర్ బోట్ల మంగారావు, పేర్ని కుటుంబసభ్యుల బ్యాంకు ఖాతాలకు జమ చేసినట్లు తేలింది. పేర్ని నాని సూచనల మేరకే ఈ నగదును వివిధ బ్యాంకు ఖాతాలకు జమ చేసినట్లు మానసతేజ పోలీసుల ఎదుట అంగీకరించాడు. ఈ వివరాలను నమోదుచేసిన పోలీసులు ఉన్నతాధికారుల సూచనల మేరకు పేర్ని నానిపై కేసు నమోదు చేశారు. ఆయన్ను అరెస్టు చేసేందుకు మంగళవారం తెల్లవారుజామున ప్రయత్నించారు. ఇది తెలిసి ఆయన అదృశ్యమయ్యారు. ఆ తర్వాత ముందస్తు బెయిల్ కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు.

6 వరకు తొందరపాటు చర్యలొద్దు

పోలీసులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): గోడౌన్ నుండి రేషన్ బియ్యం మాయమైన వ్యవహారంలో వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్నినానిపై సోమవారం వరకు ఎలాంటి తొందరపాటు చర్యలూ తీసుకోవద్దని హైకోర్టు ఆదేశించింది. వ్యాజ్యంపై విచారణను జనవరి 6కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి మంగళవా రం ఉత్తర్వులు జారీ చేశారు. పేర్ని సతీమణి జయసుధ మచిలీపట్నంలోని తన గోదామును పౌరసరఫరాలశాఖకు లీజుకిచ్చారు. ఇందులో నిల్వ చేసిన రేషన్ బియ్యం మాయమయ్యాయ ని ఆ శాఖ అధికారి కోటిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా జయసుధపై పోలీసులు కేసు నమో దు చేశారు. తాజాగా పేర్ని నానిని ఏ-6గా చేర్చా రు. పోలీసులు అరెస్టు చేస్తారనే ఆందోళన ఉంద ని, ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఆయన హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను న్యాయమూర్తి లంచ్‌మోషన్‌గా విచారణకు స్వీకరించారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది సి.రఘు వాదనలు వినిపించారు. గోడౌన్‌లోని బియ్యం నిల్వలతో పేర్ని నానికి సంబంధం లేదని.. రాజకీయ కారణాలతో నిందితుడిగా చేర్చారని తెలిపారు. సోమవారం రాత్రి 70 మంది పోలీసులు ఆయన నివాసం వద్దకు వచ్చారని, అరెస్టు చేస్తారనే ఆందోళన ఉందన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్(పీపీ) మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ.. వ్యాజ్యం మొదటిసారి విచారణకు వచ్చిందని.. కేసు వివరాలు తెప్పించుకునేందుకు సమయం కోరారు. రేషన్ బియ్యం గోడౌన్ నుంచి తరలించి, వాటిని విక్రయించడంలో పిటిషనర్‌ది కీలక పాత్ర అని, కస్టోడియల్ విచారణ అవసరమని తెలిపారు. సీనియర్ న్యాయవాది రఘు స్పందిస్తూ.. ప్రాసిక్యూషన్ వివరాలు తెప్పించుకునేందుకు సమయం కోరుతున్నందు న పిటిషనర్‌పై తొందరపాటు చర్యలువద్దన్నారు.

ఉద్యోగుల సంక్షేమానికి తొలి ప్రాధాన్యం



ధర్నాచౌక్(విజయవాడ), డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సంక్షేమానికే తన తొలి ప్రాధాన్యమని ఏపీఎన్జీజీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన ఎ.విద్యాసాగర్ పేర్కొన్నారు. ప్రభుత్వంతో సామరస్యపూర్వక సంబంధాలను కొనసాగించి ఉద్యోగుల సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మంగళవారం విజయవాడలోని జింఖానగ్రౌండ్‌లో ఆయన ప్రమాణస్వీకారం చేశారు. ఎన్జీవో హోం నుంచి ఉద్యోగులతో భారీర్యాలీగా సభా ప్రాంగణానికి చేరుకున్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.శివారెడ్డి ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ అపరిష్కృతంగా ఉన్న ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తానన్నారు. అవసరమైతే ఆందోళనబాట పడతానని, వారి సంక్షేమానికి కృ షి చేస్తానని తెలిపారు. సంఘం మాజీ అధ్యక్షుడు పరుచూరి అశోక్‌బాబు, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, మేధావుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, ఏపీఎన్జీజీవో సహాధ్యక్షులు దస్తగిరిరెడ్డి పాల్గొన్నారు.

బియ్యం 'సిట్'లో మార్పులు

అమరావతి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): కాకినాడ పోర్టు నుంచి బియ్యం అక్రమ ఎగుమతి వ్యవహారం లో బాధ్యులను గుర్తించి చట్టపరంగా శిక్షించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'సిట్'లో ఎట్టకేలకు మార్పులు జరిగాయి. డిసెంబరు 6న ఏర్పాటు చేసిన సిట్‌లో అందరూ పోలీసులే ఉండటం చర్చనీయాం శం అవడంతో అప్పట్లో 'ఆంధ్రజ్యోతి' ఆ విషయం ప్రచురించింది. వైసీపీ అనుకూల డీఎస్పీలు కూడా సిట్‌లో ఉన్నారంటూ సోషల్ మీడియాలో విమర్శలు వచ్చాయి. దీనిపై సమీక్షించుకున్న ప్రభుత్వం, తాజా గా ఇద్దరు డిప్యూటీ కలెక్టర్లు, పౌర సరఫరాలు, బీసీ సంక్షేమ శాఖల నుంచి ఒక్కొక్కరి చొప్పున సిట్‌లో చేర్చింది. అయితే సిట్ అధిపతిగా సీఐడీ ఐజీ వినీత్ బ్రిజిలాల్‌ను కొనసాగించిన ప్రభుత్వం గత సిట్‌లో ఉన్న సీఐడీ ఎస్పీ బి.ఉమా మహేశ్వరరాజును మార్చలేదు. తాజా సిట్‌లో ఎ.శ్రీనివాసరావు, డిప్యూటీ కలెక్టర్(బీసీ వెల్ఫేర్), కాకినాడ; పి. రోహిణీ, ఆర్జేడీ (మహిళా శిశు సంక్షేమం) కర్నూలు; కె.మధుసూదనరావు, జిల్లా పౌర సరఫరాల అధికారి, విజయనగరం; ఎం.బాల సరస్వతి, కోనసీమ జిల్లా పౌర సరఫరాల మేనేజర్‌ను, సభ్యులుగా చేర్చి తాజాగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత సిట్‌లో సభ్యులుగా ఉన్న డీఎస్పీలు అశోక్ వర్ధన్ రెడ్డి, బాలసుందరరావు, గోవిందరావు, రత్తయ్యలను తప్పించింది.

ఇక డాకింగ్‌పై గురి..!

● ఈ నెల 7న ఉండొచ్చన్న ఇస్రో ● ఇస్ట్రాక్ సెంటర్ నుంచి పర్యవేక్షణ ● జనవరిలో వందో ప్రయోగానికి ఇస్రో సిద్ధం

సూళ్లూరుపేట, డిసెంబరు 31: అంతరిక్షంలో డాకింగ్ సాంకేతికతను ప్రదర్శించేందుకు ఇస్రో చేపట్టిన స్పేడెక్స్ మిషన్‌లో కీలక ఘట్టం పూర్తయింది. సోమవారం రాత్రి ఛేజర్, టార్గెట్ అనే జంట ఉపగ్రహాలను రోదసీలోకి మోసుకెళ్లిన పీఎస్ఎల్వీ-సీ60 వాటిని ఒకదాని తర్వాత ఒకటిగా నిర్దేశిత కక్ష్యలో ప్రవేశపెట్టింది. ఇక ఈ ప్రయోగంలో మిగిలింది అసలు సిసలైన డాకింగ్ (రెండు ఉపగ్రహాల అనుసంధానం) ఘట్టమే. దీనిపై ఇస్రో చైర్మన్ మాట్లాడుతూ.. డిసెంబరు 31 నుంచి ఇస్రో శాస్త్రవేత్తలు బెంగళూరులోని ఇస్ట్రాక్ సెంటర్ నుంచి వీటిని పర్యవేక్షిస్తారని చెప్పారు. డాకింగ్ ప్రక్రియ బహుశా జనవరి 7న ఉండొచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఆ ఉపగ్రహాలు కక్ష్యలో తిరుగుతున్నాయని కొద్ది రోజుల తర్వాత వాటిని దగ్గరకు చేర్చి మరో వారం రోజుల్లో డాకింగ్ ప్రక్రియ ప్రారంభిస్తామని చెప్పారు. కాగా.. ఈ మిషన్‌లో పీఎస్ఎల్వీ ఆర్బిటల్ ఎక్స్‌పెరిమెంటల్ మాడ్యూల్ (పోయెమ్-4) ద్వారా పంపిన మరో 24 పేలోడ్లు కూడా కీలక పాత్ర పోషిస్తాయని సోమనాథ్ తెలిపారు. వాటిలో అంకుర సంస్థలు, పరిశ్రమలు, విద్యాసంస్థలతోపాటు ఇస్రో కేంద్రాల నుంచి రూపొందించిన పేలోడ్లు ఉన్నాయన్నారు. వాటిని దిగువ కక్ష్యలోకి తీసుకురానున్నట్లు తెలిపారు. అక్కడి నుంచి అవి అనేక పరిశోధనలు చేస్తాయని వివరించారు. పీఎస్ఎల్వీ-సీ60 రాకెట్ ప్రయోగం విజయవంతం కావడం పట్ల ఇస్రో గర్వంగా ఉందని, త్వరలోనే స్పేడెక్స్ మిషన్ లక్ష్యాన్ని కూడా పూర్తిచేస్తామన్నారు.

ప్రైవేటు సంస్థ అందించిన ఉపగ్రహాలు

స్పేస్ డాకింగ్ కోసం ఎస్‌డీఎక్స్01 (ఛేజర్), ఎస్‌డీఎక్స్02 (టార్గెట్) అనే జంట ఉపగ్రహాలను ఇస్రో ప్రయోగించింది. ఒక్కోటి 220 కేజీల బరువుండే ఈ శాటిలైట్లను అనంత్ టెక్నాలజీస్ లిమిటెడ్ (ఏటీఎల్) అనే ప్రైవేటు పరిశ్రమ అందించింది. కొన్నేళ్లుగా ఇస్రోతో అనుబంధం కొనసాగిస్తున్న ఏటీఎల్.. ఇస్రో సహకారంతో వాటిని రూపొందించింది. 'ఇప్పటివరకు ప్రైవేటు పరిశ్రమలు ఇలాంటి పెద్ద ఉపగ్రహాలను సొంతంగా తయారు చేయలేదు. అయితే ఈ రెండు ఉపగ్రహాలను రూపొందించి వాటిని పరీక్షించడం ఇదే తొలిసారి' అని యూఆర్ రావు స్పేస్ సెంటర్ (యూఆర్ఎస్‌సీ) డైరెక్టర్ ఎం శంకరన్ తెలిపారు. ఈ మిషన్ విజయవంతమైతే ప్రైవేటు పరిశ్రమ రంగానికి మేలు చేస్తుందని చెప్పారు.

త్వరలో శ్రీహరికోటలో ఇస్రో సెంచరీ

ఇస్రో ప్రధాన కార్యాలయం ఉన్నది బెంగళూరులో అయినా.. రాకెట్ ప్రయోగాలు ఎక్కువగా చేపట్టేది మాత్రం తిరుపతి జిల్లా శ్రీహరికోటలోనే. ఈ క్రమంలో ఇక్కడి సతీశ్ ధవన్ అంతరిక్ష కేంద్రం (షార్) అరుదైన రికార్డుకు చేరువైంది. ఈ జనవరిలో ఇస్రో జీఎస్ఎల్వీ ప్రయోగానికి సిద్ధమవుతోంది. ఇది శ్రీహరికోటలో చేపట్టే 100వ ప్రయోగంగా రికార్డులకెక్కనుంది. స్పేడెక్స్ మిషన్ కోసం డిసెంబరు 30న.. ఇస్రో చేపట్టిన పీఎస్ఎల్వీ-సీ60 రాకెట్ ప్రయోగం ఇక్కడ 99వది. ఈ సందర్భంగా ఇస్రో చైర్మన్ సోమనాథ్ మాట్లాడుతూ.. కొత్త ఏడాది ఆరంభంలో ఇక్కడ వందో ప్రయోగానికి సిద్ధమవుతున్నామని చెప్పారు. జీఎస్ఎల్వీ ప్రయోగం ద్వారా నావిగేషన్ శాటిలైట్ ఎన్వీఎస్-02ను జనవరిలో ప్రయోగిస్తామని తెలిపారు. 2023 మే నెలలో జీఎస్ఎల్వీ-ఎఫ్12 రాకెట్ ద్వారా ఎన్వీఎస్-01 అనే శాటిలైట్ ఉపగ్రహాన్ని ఇస్రో విజయవంతంగా ప్రయోగించింది.

నెల్లూరులో సందడే సందడి



వీఆర్సీ కూడలిలో మంగళవారం అర్ధరాత్రి యువత ఆనందం



కుటుంబ సభ్యులతో కలిసి బైక్‌పై వచ్చిన నగరవాసులు



బయటకు వచ్చిన యువతను అదుపు చేసేందుకు రోడ్లపై పోలీసుల పహారా

ఒకరిద్దరిని కాదు.. 40 మందిని..!!

▸▸ **ఇంటర్ విద్యార్థులను చితకబాదిన లెక్చరర్**

▸▸ **చర్యలకు అధికారుల మీనమేషాలు**



విద్యార్థి చేతిపై గాయాలు

తగరపువలస, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లాలోని తగరపువలస బాసర జూనియర్ కళాశాలలో మంగళవారం కెమిస్ట్రీ లెక్చరర్ మహేష్ పూనకం వచ్చినట్లు ఎంపీసీ ఇంగ్లీషు మీడియం విద్యార్థులను చావబాదారు. చదువుపై శ్రద్ధ చూపడంలేదన్న సాకుతో విచక్షణ మరచి ఏకంగా తరగతి గదిలోని 40 మందినీ కర్రతో చితక్కొట్టారు. విద్యార్థుల ఒంటిపై తట్లు తేలడం, ఓ విద్యార్థి చేతి వేలు చిట్లి రక్తం కారడంతో ఫొటోలు తీసి విద్యార్థి సంఘం నాయకులకు పంపించడంతో, ఈ విషయం తెలిసి, దానిపై కూడా కళాశాల యాజమాన్యం కూడా విద్యార్థులను వేధించింది. ఎవరు ఫొటోలు తీశారు?, ఎవరికి పంపించారో చెప్పాలంటూ మరోసారి వారిని కొట్టారు. ఈ విషయం తెలుసుకున్న ఏఐడీఎస్‌ఓ విద్యార్థి సంఘం విశాఖ జిల్లా నాయకుడు బి.సంతోష్. ఆర్ఐఓకు ఫిర్యాదు చేశారు. అయితే అధికారులు కూడా కళాశాల యాజమాన్యానికే వత్తాసు పలుకుతున్నట్టు మాట్లాడారని విద్యార్థి సంఘం నేతలు ఆరోపిస్తున్నారు. పిల్లలు సరిగా చదవలేదని, మార్కులు తక్కువ వచ్చాయని వాతలు వచ్చేలా కొడతారా? అంటూ నేతలు ప్రశ్నిస్తున్నారు. ఈ వివాదం రచ్చకాకుండా చూసేందుకు విద్యార్థుల తల్లిదండ్రులను రప్పించి వారితో మాట్లాడుతున్నట్లు చెబుతున్నారు. విద్యార్థులను కొట్టిన లెక్చరర్ మహేష్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకుంటామని కళాశాల చైర్మన్ పి.రమేష్ 'ఆంధ్రజ్యోతి'కి వివరణ ఇచ్చారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao**, on behalf of Aamoda Publications Pvt. Ltd., *Printed and Published* at "Aamoda Press" at 91, Wood Complex, Vedayapalem, Nellore, A.P., Tel. No.0861-2312299, Editor: **N.Rahul Kumar**, RNI No. APTEL/2004/11742, **Managing Director : Vemuri Radha Krishna**, Founder: K.L.N.Prasad.